
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.03.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# చరిత్ర శిథిలాలపై నవ్యరాజధాని

## › పేరు కరెక్టే... ప్లేస్ కరెక్టేనా? › నెత్తురు పారిన నేలపై మళ్ళీ నిర్మాణాలా?

***అమరావతి... నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నగరం. చారిత్రాత్మక పేరు. చరిత్ర కలిగిన ఊరు. స్వర్గలోకాధిపతి ఇంద్రుడు రాజధాని పేరు కూడా అమరావతియే! ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని కూడా అమరావతియే. అయితే ఇది స్వర్గంగా విలసిల్లుతుందో, నరకంగా మారుతుందో అప్పుడే చెప్పలేము.***

అమరావతి కేంద్రంగా నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణం జరగబోతుందని 'లాయర్' తేది 14-11-2014 సంచికలోనే 'బుద్ధప్రదేశ్ కోసమే సింగపూర్' అనే శీర్షికలో వెల్లడించింది. ఆరోజుకు చంద్రబాబుకు అనుకూల పత్రికలు కూడా అమరావతిని రాజధానిగా అంచనా వేయలేకపోయాయి. అమరావతి పేరులో రాజసం వుంది. చరిత్ర వుంది. సంస్కృతి వుంది. హిందువులకు ప్రీతిపాత్రమైన పంచారామాలలో అమరావతి ఒకటి. ఇక చరిత్రలో బౌద్ధం వెల్లివిరిసింది కూడా ఇక్కడే. ఒకనాటి బౌద్ధ సంస్కృతి వైభవానికి ఇప్పటికీ మిగిలిన బౌద్ధ స్థూపాలు చిహ్నాలుగా కనిపిస్తాయి. అలాగే జైన సంస్కృతి కూడా ఇక్కడ విలసిల్లి వుండడం విశేషం. ఇన్ని సంస్కృతుల కలయిక అమరావతి.

**అమరావతి రాజధాని అని 'లాయర్' ఏనాడో చెప్పింది**




నవంబర్ 14, 2014 నాటి 'లాయర్' మొదటిపేజీ

చరిత్రను పరిశీలించి చూస్తే ఆంధ్రులకు ఒకప్పుడు రాజధాని కూడా ఇదే! పూజల నిమిత్తమై గౌతమబుద్ధుని అవశేషాలతో కట్టిన అమరావతి స్థూపం ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందింది. క్రీస్తు పూర్వమే ధరణి కోటగా, ధాన్య కటకముగా, శాత వాహనుల రాజధానిగా పరిఢవిల్లింది అమరావతి పట్టణం. కాలక్రమంలో అనేక యుద్ధాలకు వేదిక కూడా ఈ పట్టణమే! ఆ యుద్ధాలలో నెత్తుటేర్లు పారాయి. వివిధ సంస్కృతులపై దాడులు జరిగాయి. ఆనాటి దాడులకు శిథిలాలు ఈరోజు చిహ్నాలుగా మిగిలాయి.

ఆ శిథిలాలపైనే ఈరోజు నూతన రాజధాని నిర్మాణానికి చంద్రబాబు సర్కార్ శ్రీకారం చుట్టింది. క్రీస్తుపూర్వమే రాజధానిగా విరాజిల్లిన పట్టణం కాలగర్భంలో కలిసిపోయింది. మళ్లీ దానికి పూర్వవైభవం తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. రాజధానికి అమరావతి పేరు ఎంతో బాగుంది. మన దేశంలో చాలా రాష్ట్రాల రాజధానుల పేర్లు మనవి కావు. మన సంస్కృతి, చరిత్రకు ఆ పేర్లకు సంబంధం లేదు. అంతెందుకు దేశ రాజధాని ఢిల్లీ పేరే మనది కాదు. కొన్ని రాజధానులకు మహ్మదీయులు (మిగతా 10వ పేజీలో)

## కొత్త ఎస్పీగా గజరావు భూపాల్ గ్రేహౌండ్స్‌కు సెంథిల్





(వివరాలు 12వ పేజీలో)

## అసెంబ్లీ వార్‌లో... విజేతలెవరు?

### పరిపక్వత చూపిన ప్రతిపక్ష నేత




**రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మేధావులు, విజ్ఞానవంతులే కాదు, చదువులేని నిరక్షరాసులు సైతం ఛీదరించుకునేలా జరిగాయి. ఆ విధంగానే ముగిసాయి. ఇందులో ఒక వ్యక్తిని, ఒక పార్టీని తప్పు పట్టలేము. అసెంబ్లీ సమావేశాలను ఒక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కంటే హీనంగా నిర్వహించడంలో అందరికీ తలాకొంత పాత్ర వుంది. అయితే ఈ విషయంలో మెజార్టీ వాటా మాత్రం అధికార తెలుగుదేశంపార్టీదే!**

ఈ అసెంబ్లీ సమావేశాలు రచ్చ రచ్చగానే కాదు రొచ్చు రొచ్చుగా జరిగాయి కూడా! అనుభవజ్ఞులు, సమస్యలపై అవగాహన వున్న సీనియర్‌లు సభలో మంత్రులుగా గాని, అధికార, ప్రతిపక్ష సభ్యులుగా గాని లేని కొరత స్పష్టంగా కనపడింది. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానం చెప్పే ఓపిక మంత్రులకు లేకుండా పోయింది. సమస్యలపై నిలదీసి ఓపిగ్గా సమాధానాలు రాబట్టే




### హుందాగా వ్యవహరించని అధికార నేత



తీరిక ప్రతిపక్ష సభ్యులకు లేకుండా పోయింది. ఎంత ఎక్కువగా రచ్చ చేస్తే అంత ఫోకస్ అవుతామని, టీవీలలో బాగా కనిపిస్తామనే ఫీలింగ్ ఎక్కువ మంది సభ్యులలో వుంది.

చంద్రబాబు మెహర్బానీ కోసం కొందరు తెలుగుదేశం ఎమ్మెల్యేలు చేసిన ప్రసంగాలు, దూషణల పర్వం చాలా అసహ్యంగా వుండింది. ఇలాంటి వారికా మనం ఓట్లేసి అసెంబ్లీకి పంపించింది అని ప్రజలు సిగ్గుపడేంతగా వుంటే, మీకంటే మేమేం తక్కువ తిన్నామా అంటూ కొందరు వైకాపా ఎమ్మెల్యేలు వారికి ఏ మాత్రం తీసిపోని విధంగా వ్యవహరించారు.


ఈ సభలో ఇంకా ఎన్నో అపశృతులు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష నేత జగన్ మాట్లాడేటప్పుడు స్పీకర్ పదేపదే మైక్ కట్ చేయడం, జగన్ ప్రసంగిస్తున్నప్పుడు నలుగురైదుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేచి గోల చేస్తున్నా స్పీకర్ వారిని అదుపుచేయక పోవడం, వీటికి (మిగతా 10వ పేజీలో)

# 'కామధేను'వులకు మంచిరోజులు


కామధేను పునరుత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు

ఎట్టకేలకు కామధేనువులకు మంచి రోజులు వచ్చాయి. ప్రత్యేకించి మెట్ట ప్రాంతమైన కొండాపురం వంటి వెనుక బడిన ప్రాంతంలో వున్న చింతలదేవి ప్రాజెక్టులో దాదాపు 250 కోట్ల రూపాయల వ్యయంతో 'కామధేను' పథకాన్ని ప్రారంభించి, దేశీయ పశువుల పరిరక్షణకు, పునరుత్పత్తికి శ్రీకారం చుట్టడం సంతోషకరమే. ఒకరకంగా ఇది కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు పుణ్యమేనని చెప్పవచ్చు. చింతలదేవికి ఈ పథకం రావడం, తొలి విడతగా ఈ పథకానికి పాతిక కోట్ల రూపాయలు ఇవ్వడంలోనూ ఆయన కృషి మరువలేనిది. నాయుడుగారికి రాజకీయ భవితవ్యాన్నిచ్చిన ఉదయగిరి నియోజక వర్గానికి ఆయన కృతజ్ఞతాపూర్వకంగా ఈ పథకాన్ని ఒక కానుకగా ఇచ్చారేమో!.. స్వయంగా ఆయన మార్చి 21న చింతలదేవికి వచ్చి, కామధేను పునరుత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు తనకు రాజకీయ భవితవ్యాన్ని ఇచ్చారని, అందుకోసమే జాతీయ కామధేను ప్రాజెక్టును ఏర్పాటు చేయడంలో ఉదయగిరికి ఇంత ప్రాధాన్యత ఇచ్చామని ఆయన అన్నారు కూడా. అంతరించిపోతున్న పశుజాతులను సంరక్షించుకునేందుకు దోహదం చేసే ఈ పథకం మన జిల్లాకు రావడం హర్షదాయకమే. వందేళ్ళ చరిత్ర కలిగిన చింతలదేవికి ఈ పథకంతో నూతన కళ వచ్చినట్లేనను కోవచ్చు. ఈ సందర్భంగా, ఈ ప్రాజెక్టు ఉపయోగాలను జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి ప్రజలకు వివరించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్రమంత్రి వెంకయ్యతో పాటు, రాష్ట్ర మంత్రులు డాక్టర్ పి.నారాయణ, ఆరోగ్యమంత్రి కామినేని శ్రీనివాస్, దేవాదాయశాఖ మంత్రి పి.మాణిక్యాలరావు, ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, కె.సత్యనారాయణ, పరంధామిరెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ ఓబులురెడ్డి, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడొక మాట. పథకాలు ఘనం.. ప్రయోజనం శూన్యం అన్నట్లుగా, ఎన్నో పథకాలు రావడం... కాలక్రమంలో నీరుగారడం జరుగుతూనే వున్నాయి. అలా కాక, మూగజీవాలకు ఎంతో ఉపయోగకరమైన 'కామధేను' ప్రాజెక్టులనైనా సక్రమంగా అమలయ్యేట్లు చూసుకుని దేశీయ పశుజాతులను పరిరక్షించుకోవడం, వాటి పునరుత్పత్తితో పశుసంపదను పెంపొందించుకునేలా చేయడం అందరి బాధ్యత.




## సింహపురి సమాచారం

### కాంగ్రెస్, టిడిపి నాటకాలతో
## పోర్టు వెనక్కి

గత కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వాలు ఆడుతున్న నాటకాలతోనే దుగరాజపట్నం పోర్టు వెనక్కు పోయిందని తిరుపతి ఎంపి వరప్రసాద్ అన్నారు. నెల్లూరుజిల్లా గూడూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌తో కలసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వాకాడు మండలంలోని దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన బిల్లులో దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు ప్రతిపాదన ఉన్నప్పటికి, షార్, అటవీశాఖ, వన్యప్రాణి కేంద్రాల నుంచి అనుమతులు వున్నప్పటికి కూడా పోర్టు ఏర్పాటుకు సంబంధించి భూముల సేకరణకు నిధులు లేవని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం అభివృద్ధికి ఆటంకం కలిగించడమేనన్నారు. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు వల్ల జిల్లా ఎంతో అభివృద్ధి చెందడంతో పాటు ప్రత్యక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో వాకాడు జడ్పీటీసీ సభ్యురాలు ప్రమీలమ్మ, వైయస్సార్‌సిపి నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## న్యాయాన్ని సంరక్షించాలి

సివిల్ కేసులలో ఏళ్ళ తరబడి వాదోపవాదాలు జరుగుతుండడంతో ప్రజలు కోర్టులను ఆశ్రయించేందుకు వెనుకంజ వేస్తున్నారని, న్యాయవాదులు కూడా న్యాయాన్ని సంరక్షించే విధంగా వ్యవహరించాలని నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు సూచించారు. ఆదివారం నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయం సమీపంలో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి న్యాయ వ్యవస్థ ఏర్పాటు జరిగిందన్నారు. దాదాపు 170ఏళ్ల తర్వాత నాయుడుపేటలో తిరిగి కోర్టును ఏర్పాటు చేసుకోవడంలో ఇక్కడి న్యాయవాదులు ఎంతో కృషి చేసారని ప్రశంసించారు. సూళ్లూరుపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నాగశశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యామయూర్తులు, న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కోర్టు నిర్మాణ పనులను చేపట్టిన కార్మికులను, స్థానిక న్యాయవాదులను, సూళ్లూరుపేట సివిల్ కోర్టు న్యాయమూర్తులను శాలువా, పూలమాలలతో జిల్లా జడ్జి సత్కరించారు.

## ఆర్‌ఎంకు స్థాన చలనం

నెల్లూరు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చింతా రవికుమార్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. 2013జనవరిలో ఆయన నెల్లూరు ఆర్టీసీ ఆర్‌ఎంగా వచ్చారు. రెండేళ్ల మూడు నెలల పాటు ఎలాంటి వివాదాలు లేకుండా కొంతవరకు బాగానే పనిచేశారు.

● ACT కానుక

# నెల్లూరోళ్ళ కోసం 400+ ఛానెళ్ళు

## ఆవిష్కరించిన ముప్పవరపు వెంకయ్య



ఆకాష్ కేబుల్ నెట్‌వర్క్ (ACN) ద్వారా నెల్లూరోళ్ళకి కేబుల్ టివి ప్రసారాలను పరిచయం చేసిన శివకుమార్‌రెడ్డి ఇప్పుడు ACT సహకారంతో 400+ ఛానళ్ళను ప్రసారం చేసే మొట్టమొదటి జిల్లాగా నెల్లూరుకు స్థానం కల్పించాడు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఈ ప్రయోగాన్ని నెల్లూరులో ఆవిష్కరించారు.

మన్మథనామ ఉగాది సందర్భంగా అదేరోజు సాయంత్రం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు యాక్ట్ ఛానళ్ళను లాంచ్ చేశాడు. ఇదే వేదికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబుతో పాటు మంత్రులు కామినేని శ్రీనివాస్, మాణిక్యాల రావు, నెల్లూరు నగర మాజీఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి వెంకయ్యతో పాటు పాల్గొన్నారు. యాక్ట్ సంస్థల ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ సుందరరాజు వారికి స్వాగతం పలికారు.

ఏ సిటిలోనైనా యాక్ట్ సిటీ నెంబర్1గా నిలవాలని యాక్ట్ యాజమాన్యాన్ని వెంకయ్య ఆశీర్వదించారు. నాణ్యమైన ప్రసారాలతో ప్రజలకు చేరువైన యాక్ట్ భవిష్యత్తులో అత్యున్నత శిఖరాలకు చేరాలని ఆయన దీవించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులను యాక్ట్ తరపున నెల్లూరుశాఖ యం.డి శివకుమార్‌రెడ్డి, ఆపరేషన్స్ హెడ్ బి.వి.సుబ్బారావులు సత్కరించారు. 360స్టాండర్డ్ డెఫినిషన్(SD) ఛానల్స్‌తో పాటుగా 40కిపైగా హైడెఫినిషన్(HD) ఛానళ్ళను దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా నెల్లూరులో ప్రారంభించడం అభినందనీయం.

## ముక్కు పిండి...

# పన్నులు వసూలు చేస్తున్నారు

- విసూత్న తరహాలో కార్పొరేషన్
- ఒక్క రోజే రూ. 8.26 లక్షలు వసూలు



***పన్నులకు సంబంధించి మొండిబకాయిల వసూళ్ళకు నగర కార్పొరేషన్ కమిషనర్ చక్రధరబాబు కొత్త తరహాలో చర్యలు చేపట్టడానికి సమాయత్తమయ్యారు. ఆ చర్యలు కార్పొరేషన్‌లోనే కాదు, నగరం లోనూ కలకలం రేపుతున్నాయి.***

బకాయిదారులు ఎంతటి వారైనా సరే, పన్నులు తప్పకుండా చెల్లించాల్సిందే.. ఇందులో ఎట్టి మినహాయింపు లేదు.. అంటూ కార్పొరేషన్ అధికారులు కూడా రెట్టింపు ఉత్సాహంతో పన్నుల వసూళ్లకు సిద్ధమవుతున్నారు. ట్రంకురోడ్డులో వున్న ఒక భారీ షోరూమ్ భవనాధినేత ఒకరు రూ.16లక్షలకు పైగానే పన్నులు చెల్లించాల్సి వున్నా, ఆ పన్నులు కట్టకపోయేసరికి కార్పొరేషన్ సిబ్బంది ఏకంగా ఆ భవనం ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేయడంతో, ఆ యజమాని దిగి వచ్చారు. బకాయిలు చెల్లించకుంటే భవనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అడిషనల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి కూడా అక్కడికి చేరుకుని, యజమానితో మాట్లాడగా కొంత మొత్తం చెల్లిస్తామని యజమాని చెప్పడంతో, కనీసం సగమైనా చెల్లించకుంటే తాము ఇక్కడినుంచి కదిలేది లేదని సిబ్బంది భీష్మించుకుని కూర్చున్నారు. ఇక చేసేదేమీ లేక, ఆ యజమాని రూ.8.26 లక్షలకు చెక్ ఇచ్చేశారు. మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలోనే ఇస్తామన్నాడు. దీంతో సోమవారం ఒక్కరోజే రూ. 8.26 లక్షలు వసూలు చేసినట్లయింది. ఇది ఒక్కరోజు పన్నుల వసూళ్ళలో రికార్డుస్థాయి కలెక్షన్ అని వేరే చెప్పనక్కర లేదు. వాయిదాల మీద వాయిదాలు వేస్తూ పన్నులు కట్టకపోతే, కార్పొరేషన్ ఎలా నడవాలి?.. నగరాభివృద్ధికి నిధులు ఎక్కడనుంచి తేవాలి?.. అని అధికారులు, సిబ్బంది పన్నుల వసూళ్లను వేగవంతం చేస్తున్నారు. ఈ దెబ్బతో బకాయిదారులు హడలిపోతున్నారు.

అయినా, మనలో మాట. పన్నులు ఎటూ కట్టక తప్పదు. ఈరోజు.. కాకుంటే రేపైనా చెల్లించాల్సిందే. కార్పొరేషన్ సిబ్బంది ఇంటి ముందుకు వచ్చి నిరసనలు చెప్పేదాకా నిమ్మళంగా వుండకుండా, కట్టాల్సిన ఆ పన్నులేవో ఎట్టోకట్ట తంటాలుపడి కట్టేస్తే ఈ యాగీ అంతా వుండదు కదా!.. ఏమంటారు?..

**సవరణ:** తేది 20.03.2015 సంచికలో 7వ పేజీ నందు 'తోపుగుంటను దత్తత తీసుకున్న డిఐజి దామోదర్' అనే వార్తలో తోపుగుంటకు చెందిన ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య, డిఐజి దామోదర్‌కు మంచి మిత్రుడు అని పొరపాటున ప్రచురించాం. దానిని ఐఏఎస్ అధికారి కృష్ణయ్యకు బదులుగా ప్రముఖ కీళ్లు, ఎముకలు వైద్యనిపుణులు డాక్టర్ కె.కృష్ణయ్యగా సవరించుకోవలసినదిగా మనవి. – సం/–

# ఈ మన్మథలో రైతులు ఆనందంగా ఉండాలి

## - జిల్లా కలెక్టర్ యం.జానకి




మన్మథనామ సంవత్సరంలో మంచి వర్షాలు పడి రైతులు ఆనందంగా ఉండాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి అన్నారు. 21వ తేదీ ఉగాది ఉత్సవాలు నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త రాష్ట్రంలో ఆర్థిక సమస్యలు వున్నప్పటికీ అన్నింటిని అధిగమించి ఆర్థికంగా జిల్లా అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. జిల్లా జడ్జి కనక దుర్గారావు మాట్లాడుతూ తెలుగువారు అందరి క్షేమాలు కోరేవారని, ఈ మన్మథ నామ సంవత్సరం అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఏయండి ఇంతియాజ్, మునిసిపల్ కమిషనర్ చక్రధర్‌బాబు, అదనపు జాయింట్ కలెక్టర్ ఎస్.ఏ.రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు యం.డి.వెంకటరాజు బృందం నాదస్వర కచ్చేరి అలరించింది. పంచాంగ శ్రవణాన్ని బ్రహ్మశ్రీ సి.పూర్ణానందశాస్త్రి చదివి వినిపించారు. అతిథులు కవితలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంగీత పాఠశాల, శ్రీ గురుకృప కళాక్షేత్రం విద్యార్థినుల శాస్త్రీయ నృత్యాలు, విడవలూరు బృందం జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాల్గొన్న అందరినీ జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి శాలువాలతో, మెమొంటోలతో సత్కరించారు.



## జగన్‌కు... వై.యస్.కు...

# నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా!

## - ఆనం వివేకా విమర్శ



దివంగత నేత వై.యస్.రాజశేఖర రెడ్డికి, వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా వుందని మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన ఏ.సి సెంటర్‌లోని తన కార్యాలయంలో ఇద్దరిని తిట్టడం టార్గెట్‌గా చేసుకుని విలేకరుల సమావేశం పెట్టారు. జగన్‌ను ఏకారు. వై.యస్.రాజశేఖరరెడ్డిలో వున్న మంచి లక్షణాలు ఒక్కటి కూడా జగన్‌లో లేవన్నారు. వై.యస్. పోరాట యోధుడని, చివరిక్షణం వరకు కాంగ్రెస్‌లో వుండి, ప్రజల కోసం పోరాడారన్నారు. వై.యస్.కున్న నిబద్ధత, అంకితభావం జగన్‌లో లేవన్నారు. చంద్రబాబుతో కుమ్మక్కై అసెంబ్లీకి ఎగనామం పెట్టాడని, తనపై కేసులను ఎత్తేయించుకోవడం కోసం జగన్ కేంద్రంతోనూ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాడని ఆరోపించారు.

పనిలో పనిగా కాంగ్రెస్‌లో నుండి బీజేపీలో చేరిన నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని కూడా నాలుగు మాటలన్నారు. పెద్దాయన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కీర్తి, గౌరవానికి రాంకుమార్‌రెడ్డి భంగం కలిగించాడన్నారు. ఇందిరాభవన్ ఎవరి తాత ముల్లె కాదని, కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే దానిని కట్టారని అన్నారు. ఇది ట్రస్ట్‌కు చెందిన బిల్డింగ్ అంటే ఒప్పుకునేది లేదని, దీనిలోని ప్రతి పైసా కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలదేనన్నారు. కాంగ్రెస్‌పార్టీ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డికి ఎమ్మెల్యే నుండి ముఖ్యమంత్రి దాకా అన్ని పదవులనిచ్చి గౌరవించిందని, రాంకుమార్‌రెడ్డి దానిని విమర్శించి మాట్లాడడం తగదని అన్నారు.

# నారాయణలో జాతీయ స్థాయి సింపోజియం లావా-2కె15

గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ స్థాయి సింపోజియం-లావా2కె15ను నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డా॥ పి.చెన్నారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంజనీరింగ్ పట్టా అందుకోవడంతో పాటు ఆ విద్యార్థిలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలని అన్నారు. అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పోస్టర్, పేపర్ ప్రెజంటేషన్, టెక్నికల్ క్విజ్‌లో పాల్గొన్నారు. కాగా, సాయంత్రం పై పోటీలలో గెలుపొందిన విజేతలకు నారాయణ విద్యాసంస్థల సిఇఓ వి.విజయభాస్కర్‌రెడ్డి బహుమతులందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నారాయణ కాలేజీని మంచి అభివృద్ధిలోకి తీసుకువస్తానని, ఇంజనీరింగ్ అంటే నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ అనే విధంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వరప్రసాదరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

## 'ప్రభా'తం

మన్మథ నామ సంవత్సరం. పేరుకు తగ్గట్టుగా ఎంతో 'మధురమైన' సంవత్సరం కూడా. అందుకే, ఈ కొత్త ఏడాది రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధిని సాధిస్తుందని, ఈ ఏడాది అందరికీ మధురానుభూతులు మిగిలిస్తుందని పంచాంగకర్తలు కొందరు ఈ ఉగాదిన పంచాంగశ్రవణాల్లో చెప్పిన మాటలు అందరికీ వీనులవిందు చేశాయి. వారి మధుర వాక్కులు ఫలించాలనే కోరుకుందాం.

అయితే, రాష్ట్రం ఇప్పుడున్న అయోమయ పరిస్థితుల్లో ఈ ఏడాది ఆశించిన అభివృద్ధిని సాధిస్తుందా?.. అన్నది రాజకీయ పండితుల ధర్మ సందేహం. భారీ లోటు బడ్జెట్‌తో సతమతమవుతున్న రాష్ట్రం ఈ ఏడాదైనా అప్పుల నిప్పులగుండం లోంచి బయటపడుతుందా అన్నది మరో సందేహం. అన్నిటికీ మించి, రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందా?.. విభజన సమయంలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలన్నీ నెరవేరు తాయా?.. అనేది ఎటూ తేలని సందిగ్ధం. ప్రత్యేకహోదా వస్తే, ప్రత్యేక ప్యాకేజీలు కూడా వస్తాయి కనుక, రాష్ట్ర పురోభివృద్ధికి చాలామటుకు నిధుల కొరతను అధిగమించవచ్చు. అయితే, విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని బిజెపి నేతలు చెప్తున్నప్పటికీ, విభజన చట్టంలో రాష్ట్రానికి ప్రత్యేకహోదా అన్న అంశమే లేదనడం కాస్త బాధపిస్తున్నా, ఈ విషయమై చర్చించి రాష్ట్రానికి ప్రత్యేకహోదా వచ్చేలా కృషి చేస్తామని చెప్పడం మాత్రం ఒక ఉపశమనం.


ఇకపోతే, అదిగో వచ్చేస్తుంది.. అనుకున్న పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్రబడ్జెట్ నుంచి ఆశించిన కేటాయింపులు లేకపోవడం, విభజనతో వచ్చిన భారీ ఆర్థిక లోటును భర్తీ చేసుకునేందుకు కేంద్రం ఇస్తామన్న పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం ఆంధ్ర సర్కారును అయోమయంలో పడేస్తోన్న నేపథ్యంలో, 'మన్మథ' నామ సంవత్సరం ప్రారంభమై పట్టుమని పది రోజులు కూడా కాకముందే మరోవైపు రాష్ట్రం విద్యుత్ ఛార్జీల మోత మోగించడం ఎంతైనా విచారకరం. ఏప్రిల్ 1 నుంచే కొత్త విద్యుత్‌ఛార్జీల వడ్డనకు సమాయత్తం కావడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అసలైన దర్పణంగా భావించవచ్చు. విద్యుత్ ఛార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచేది లేదన్న తెలుగుదేశాధీశులు, ప్రస్తుతం వున్న పరిస్థితుల్లో తప్పనిసరి అంటూ ఛార్జీల భారాలు మోపుతుండడం శోచనీయం. విద్యుత్ వినియోగదారులపై దాదాపు 941 కోట్ల రూపాయల దాకా భారాన్ని మోపేందుకు రంగం సిద్ధం చేయడం.. ప్రజలకు మళ్ళీ పాత సంక్షోభపు రోజులు గుర్తుకు తెస్తున్నాయనే భావనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 200 యూనిట్లకు మించి విద్యుత్‌ను వినియోగిస్తే, కొత్త ఛార్జీలు వర్తించేలా చేయడమంటే, మధ్యతరగతి ప్రజలపై కూడా ఎలాగూ ఆ భారం పడక తప్పదనే అభిప్రాయాలు అంతటా వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ వినియోగం బాగా పెరిగిన నేటి రోజుల్లో 200 యూనిట్లు దాటిపోవడమన్నది సర్వసాధారణమే. కాగా, మొన్నమొన్నటి దాకా విద్యుత్ సంక్షోభంలో అవస్థలు పడిన రాష్ట్రాన్ని, టిడిపి అధికారంలోకి వచ్చాక ఎలాగో ఆ సంక్షోభం సమసిపోయిందని, ఇక విద్యుత్‌కు ఎలాంటి ఢోకా వుండదని ప్రజలు సంతోషిస్తున్న తరుణంలో, అందులోనూ ఈ వేసవిలో విద్యుత్ కోతలు కూడా లేవని అందరూ ఆనందిస్తున్న సమయంలో.. 'ఉగాది కానుక' అన్నట్లుగా, హటాత్తుగా విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ప్రజలను నిజంగానే షాక్‌కు గురిచేస్తోంది.

విద్యుత్ ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నా మని, అందుకు అవసరమైన సహకారాన్ని కేంద్రం అందిస్తోందని గతంలో చెప్పిన మాటలు ఇంకా మరచిపోకముందే, కొత్తగా ఇప్పుడు విద్యుత్‌ఛార్జీలను పెంచడం ఏమిటన్నది అందరినీ అయోమయానికి గురిచేస్తున్న ప్రశ్న. ఏదోవిధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని ప్రజలకు భారం పడకుండా చూడాలే తప్ప, నిత్యావసరమైన విద్యుత్ వినియోగంపై భారం మోపితే ఎలాగన్నదే సామాన్యుడి సదసత్సంశయం. అయితే, నిజానికి అది పెద్ద పెంపేమీ కాదనీ, 86 శాతం మందిపై ఆ ఛార్జీల ప్రభావం వుండదని, తమ హయాంలోనే విద్యుత్ రంగం సంక్షోభం నుంచి బయటపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడాన్ని కూడా అర్థం చేసుకోవాల్సిందే. అయితే, వచ్చిన చిక్కల్లా.. రాష్ట్ర ఆర్థికస్థితి బాగా లేకపోవడమే ఈ అస్తవ్యస్థ పరిస్థితు లన్నిటికీ ప్రధాన కారణంగా భావించవచ్చు. రాష్ట్రాన్ని ప్రస్తుతం వున్న పరిస్థితి నుంచి గట్టెక్కించి, ప్రగతి దారిలో పరుగులు పెట్టించాలన్న ముఖ్యమంత్రి తాపత్రయం మంచిదే కానీ, అందుకు తగ్గ వనరులు సిద్ధం చేసుకోవడానికి కృషి చేయాలే తప్ప, పన్నులు, ఛార్జీలు పెంచడం వంటి నిర్ణయాలు సముచితమా?.. అన్నది సామాన్యప్రజల ఆవేదన.

ఈ సంగతులిలా వుంటే, మరోవైపు రాష్ట్ర రాజధాని నిర్మాణం విషయం మరింత పెద్ద సమస్య గానే వుంటోంది. సింగపూర్ తరహాలో ఆకాశ హర్మ్యాలతో అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతి వచ్చేలా కొత్త రాజధాని నిర్మించాలన్న సంకల్పం సంగతి ఎలా వున్నా.. ఇప్పుడుండే పరిస్థితుల్లో అంతటి భారీ స్థాయి నిర్మాణాలకి అంతంత నిధులు ఎక్కడనుంచి వస్తాయన్నది ఎవరికీ అర్థం కాని బ్రహ్మపదార్థమే. అసలే, లోటు బడ్జెట్‌తో రాష్ట్రం అల్లాడుతూ, అత్యవసరమైన అనేక నీటిపారుదల ప్రాజెక్టుల అభివృద్ధికి కూడా అవసరమైన నిధులు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఇలాంటి నిర్ణయాలు ఏ మేరకు ఆచరణసాధ్యమో నేతలు ఆలోచించాల్సి వుంది.

ఏదేమైనా, పంచాంగకర్తలు చెప్పినట్లుగా ఈ ఏడాది రాష్ట్రం ప్రగతిపథంలో ముందంజవేస్తే మరీ సంతోషమే. అయితే, ఇప్పుడున్న గడ్డు పరిస్థితుల్లో 'మన్మథ'..మన రాష్ట్రానికి మధుర జ్ఞాపకాలనే మిగిలిస్తుందా?. అన్నది కాస్త సందేహాస్పదమే. ఏదేమైనా, ఈ మన్మథ నామ సంవత్సరం అందరికీ శుభాన్నే కలిగించాలనీ, మన్మథ..మధురంగానే వుండాలనీ..పంచాంగకర్తల శుభవాక్కులు ఫలించి రాష్ట్రం అన్ని రంగాల్లో వేగవంతంగా అభివృద్ధి చెందాలనీ.. ఆ భగవంతుడిని మనసారా కోరుకుందాం!..

### 'మన్మథ'.. మధురమే కావాలి!



*రాష్ట్రం ఇప్పుడున్న ఆర్థిక సంక్షోభం నుంచి ఎప్పుడు గట్టెక్కుతుందో తెలియడం లేదు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఎప్పుడు వస్తుందో అనూహ్యం. పోలవరానికి అవసరమైన నిధుల్లేవు. కేంద్రం నుంచి ఆశించిన భారీ సాయం ఇంకా అందడమే లేదు. ఈ పరిస్థితుల్లో రాజధాని ఎలా కట్టుకోవాలో ఏమో?.. మరో వైపు రాష్ట్రంలో విద్యుత్ వడ్డింపులు తప్పడం లేదు. ఏదేమైనా, ఈ మన్మథ నామ సంవత్సరం రాష్ట్రానికి అన్నీ శుభాలే జరగాలని, మన్మథ.. మధురంగానే వుండాలని ఆ భగవంతుని మనసారా కోరుకుందాం!..*

## కలసికట్టుగా కదిలారు.. స్కూలుకు కొత్త కళ తెచ్చారు

- స్ఫూర్తిదాయకంగా..'స్వచ్ఛ' కార్యక్రమం
- నెల్లూరు మురికి కూడా వదలగొట్టండి

అందరూ కలసికట్టుగా కదలాలే కానీ సాధించలేనిదేమీ వుండదు. అందులోనూ అధికారులు, స్వచ్ఛంధసంస్థలవారు, అందరూ కలిస్తే ఇక పచ్చదనానికి–పరిశుభ్రతకు కొరతే వుండదు.

ఇందుకు చిన్న ఉదాహరణే ఇటీవల నెల్లూరు కస్తూరిదేవి స్కూల్‌లో జరిగిన కార్యక్రమం అని చెప్పవచ్చు. మార్చి 21న ఉగాది పర్వదినం రోజును అధికారులు స్వచ్ఛం ధంగా ఈ స్వచ్ఛ కార్యక్రమానికి విని యోగించి అందరికీ మార్గదర్శకంగా నిలిచారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి, జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ చక్రధర్‌బాబు తదితర అధికారులతో పాటు, స్థానిక నేస్తం ఫౌండేషన్ ప్రతినిధి కోరెం ప్రవీణ్ కుమార్, పాఠశాల విద్యార్థినులు, కొంత మంది సివిల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ సభ్యులు అందరూ కలసి ఈ మంచిపనికి కదిలివచ్చారు. అందరూ కలసి నగరం లోని కస్తూరిదేవి స్కూలు ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసేందుకు సంకల్పించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా తలా ఒక పని చేశారు. అంతే.. కొద్ది గంటల్లోనే ఆ స్కూలు గోడలన్నీ కళకళలాడాయి. స్కూలు ప్రాంగణమంతా పరిశుభ్రతను సంత రించుకుంది. ఆ గోడలపై వున్న వాల్ పోస్టర్లను, సినిమా దృశ్యాలను తీసివేసి గోడనంతా శుభ్రం చేశారు. అంతేకాదు, కలెక్టర్, ఎస్పీ తదితరులంతా బ్రష్‌లను చేతపట్టి గోడలకు అందమైన రంగులు కూడా వేశారు. ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నతాధికారులు ఈ కార్యక్రమం నిర్వ హించి నగర ప్రజల అభినందనలు అందు కున్నారు. ఆ గోడలపై భావితరాలకు స్ఫూర్తిదాయకంగా వుండేలా.. నెల్లూరు చరిత్రను తెలిపే విధంగా చిత్రాలు వేసేం దుకు నేస్తం ఫౌండేషన్ వారు సంసిద్ధతను వ్యక్తం చేశారు.

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ విధంగా ప్రజలకు వినూత్న రీతిలో ఉగాది శుభాకాంక్షలు తెలపడం ఎంతైనా అభినందనీయం.. స్ఫూర్తిదాయకం కూడా. 'స్వచ్ఛ నెల్లూరు' కోసం కృషి చేస్తున్నవారందరికీ 'లాయర్' శుభాభి నందనలు.

### నెల్లూరు మురికీ వదలాలి.. నగరం సుందర నందనం కావాలి

ఇదే విధంగా, నెల్లూరుకు పట్టిన మురికిని కూడా వదిలించేందుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి సమన్వయంతో ఒక మంచి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తే బావుంటుంది. 'స్వచ్ఛభారత్'లో భాగంగా, 'స్వచ్ఛ నెల్లూరు' కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలుచేయగలిగితే రాష్ట్రంలోనే నెల్లూరు మార్గదర్శకంగా వుంటుంది. నెల్లూరు నగరం పరిశుభ్రతతో.. పచ్చదనంతో వుండేందుకు, నెల్లూరును సుందర నందనవనంలా తీర్చిదిద్దేందుకు అధికారయంత్రాంగం, ప్రజాప్రతినిధులు కంకణబద్ధులు కావాలి. ఎప్పుడో అడపాదడపా కాకుండా, 'స్వచ్ఛ నెల్లూరు' కార్యక్రమాన్ని అందరూ కలసి ఒక ఉద్యమంలా చేపట్టాలి. అపరిశుభ్రతకు ఆలవాలంగా, దుర్గంధానికీ–దోమలకూ నిలయంగా వున్న మన నగరాన్ని సుందరనందనంగా చేయాలంటే అది ఏ ఒక్కరి వల్లో అయ్యేపని కాదు. అందరూ చేయి చేయి పట్టి కదిలితే తప్ప.. అది సాధ్యం కాదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో, నగరంలోని ఆయా వార్డులకు, వీధులకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంధ సంస్థలవారు, యువకులు, ప్రజలు అందరూ కలసికట్టుగా 'స్వచ్ఛ నెల్లూరు' కోసం ఉద్యమించాల్సిన సమయం ఇదే. ఇకనైనా, సత్వరం ఈ కార్యక్రమం అమలుకు పూర్తిస్థాయిలో సంకల్పించాలి. ఆయా ప్రాంతాల్లో ఎక్కడికక్కడ వీధి కమిటీలు, వార్డు కమిటీలు, స్వచ్ఛంధంగా 'స్వచ్ఛ కమిటీలు'గా ఏర్పడి..అధికారుల సహకారంతో నెలకో రోజు గట్టిగా ఓ అరపూట కష్టపడినా చాలు..నగరానికి పట్టిన మురికి కొంతైనా వదిలిపోతుంది. అందుకు అందరూ పట్టుదలతో, చిత్తశుద్ధితో ఎలాంటి అరమరికలు లేకుండా ముందుకు కదిలితే చాలు..ఎంతటి మురికినైనా ఇట్టే వదలగొట్టవచ్చు. పార్టీలకు అతీతంగా, నగరాభ్యున్నతే లక్ష్యంగా, పచ్చదనం–పరిశుభ్రతే ధ్యేయంగా అందరూ ప్రణాళికాబద్ధంగా, 'స్వచ్ఛ'ంధంగా కదలాలేగానీ..మన మురికిని మనం వదిలించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అయినా, మన పరిసరాలను మనం బాగు చేసుకోవడం కన్నా మించిన మంచి కార్యక్రమం మరొకటి ఏముంటుంది?.. విజ్ఞులు.. అనుభవజ్ఞులు, మేధావులు.. అందరూ కలసి.. ఒకసారి గట్టిగా ఆలోచించాల్సిన విషయమిది!..

### చంద్రబాబు తీరు దారుణం

అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు గాని, వారి మంత్రివర్గ సహచరులు గాని అనుసరిస్తున్న తీరు అసహ్య కరంగా ఉంటుంది. ప్రజాసమస్యలపై ప్రతిపక్షం అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానాలు చెప్పకుండా జగన్‌పై బురద చల్లడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రజాసమస్యలపై చర్చను తప్పుదారి పట్టి స్తున్నారు. అసెంబ్లీ సమావేశాలలో చంద్రబాబు ఏ రోజూ హుందాగా వ్యవహరించలేదు.

ఎస్.డి.బాషా, నెల్లూరు.




### రైతులను ముంచేస్తున్నారు

భూసేకరణ బిల్లుతో కేంద్రప్రభుత్వం, సింగపూర్ లాంటి రాజధానికి భూములంటూ రాష్ట్ర ప్రభుత్వం రెండూ కూడా రైతులను నట్టేట ముంచే కార్యక్రమాలు పెట్టుకున్నాయి. చంద్రబాబు సీఎం అవడమే రైతాంగానికి శాపంగా మారు తోంది. రాష్ట్రంలో రైతులకు మళ్ళీ గడ్డు పరిస్థితులు మొదలయ్యాయి.

సి.రామనాథ్‌రెడ్డి, బద్వేల్.

### వట్టి మాటలు కట్టి పెట్టాలి


కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు మాటలెక్కువ, పని తక్కువ. గత ఎన్డీఏ ప్రభుత్వంలోనూ ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రిగా పనిచేశారు. జిల్లాలో 30మందికి పైగా కేంద్ర మంత్రులను తీసుకొచ్చి శిలాఫలకాలు వేయించారు. ఆయన సొంత వ్యాపారాలు అభివృద్ధి చెందడం తప్పించి ఒక్క అభివృద్ధి ప్రాజెక్ట్ కూడా రాలేదు. ఇప్పుడు కూడా కేంద్రమంత్రిగా ఉన్నారు. కాని జిల్లాకు ఏమీ చేయడం లేదు.

టి.శిరీషా, నెల్లూరు.









# ఏం పనిచేయాలి? ప్రజల్లో ఎలా తిరగాలి?

**రాష్ట్ర శాసనసభ చరిత్రలో ఈ దఫా ఎమ్మెల్యేలైన వారు ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితిని గతంలో ఏ ఎమ్మెల్యేలు ఎదుర్కొని వుండరు. వీళ్ల ఎమ్మెల్యేలు అయ్యేసరికి కాలం తిరగబడింది. రాష్ట్ర రాజకీయ స్వరూపమే మారిపోయింది. ఎమ్మెల్యేలకు దక్కాల్సిన గౌరవమర్యాదలు కాని, ప్రజలకు నాలుగు పనులు చేయడానికి నిధులు కాని లేకుండాపోయాయి. ఎమ్మెల్యేలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారనేగాని తమకు ఓట్లేసి గెలిపించిన ప్రజల సమస్యలను తీర్చే విధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నారు.**

- ఎమ్మెల్యేలుగా ఉన్నా ఏమీ చేయలేకపోతున్నామనే ఆవేదన
- 10నెలలు గడిచినా చెప్పుకోదగ్గ పని ఒక్కటీ చేయలేదన్న నిర్వేదం

ఎమ్మెల్యేలు అయినందుకు ఆనంద పడాలో, ప్రజలకు రూపాయి పని చేయ లేని ఈ టైంలో ఎమ్మెల్యేలైనందుకు బాధ పడాలో తెలియని అయోమయ స్థితిలో జిల్లాలోని పదిమంది శాసనసభ్యులున్నారు.

జిల్లాలో అధికార తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురున్నారు. కోవూరు, ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాలలో అధికారపార్టీ ఎమ్మెల్యేలున్నారు. అభివృద్ధి పరంగా ఇక్కడ వాళ్ళు పొడిచిందేమీ లేదు. ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం, ప్రజల నుండి అర్జీలను స్వీకరించడం తప్పితే శాశ్వతంగా ఉపయోగపడే ఒక్క అభివృద్ధి పని కూడా ఈ మూడు నియోజక వర్గాలలో ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు. కాకపోతే కోవూరు ఎమ్మెల్యే పోలం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలు కనీసం తమ నియోజకవర్గాల ప్రజలకు అందుబాటులో నన్నా ఉన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు అయితే అది కూడా లేదు. నియోజకవర్గానికి ఏదో చుట్టం చూపుగా వచ్చిపోతున్నాడు.

అధికారపార్టీ ఎమ్మెల్యేలతో పోలిస్తే ప్రతిపక్ష వైకాపా ఎమ్మెల్యేల పరిస్థితి కొంత బెటర్. కనీసం వీరికి మేము అధికారంలో లేం కాబట్టి అభివృద్ధి పనులేమీ చేయలేక పోతున్నామని చెప్పుకోవడానికి ఆస్కార ముంది. జిల్లాలో ఏడు అసెంబ్లీలో వైకాపా ఎమ్మెల్యేలే ఉన్నారు. అయితే అధికారపార్టీ ఎమ్మెల్యేలకంటే కూడా వైకాపా ఎమ్మెల్యేలే తమ తమ నియోజకవర్గాలలో ఎక్కువుగా తిరుగుతున్నారు. జనం సమస్యలను వింటున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డిలు గ్రామాల్లో ఎక్కువ గానే తిరుగుతున్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా ప్రజా సమస్యలపై పోరాటాలకు దిగుతున్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రతిరోజూ తన నియోజకవర్గం లోని ఏదో ఒక ప్రాంతంలో పర్యటించ డంతో పాటు అవకాశం దొరికినప్పుడల్లా చంద్రబాబును, జిల్లా మంత్రి నారాయణను దుమ్మెత్తిపోస్తూ తన ఉనికిని చాటుకుం టున్నాడు. ఇక నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి తన నియోజక వర్గానికి ఎంతో పనిచేయాలనే తపన వుంది. కాని నిధుల పరంగా ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం లేదు. ఎమ్మె ల్యేగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవ లందించడం ద్వారానే ఆ పదవికి సార్ధ కత చేకూరుతుందని భావించే ఆయన ప్రభుత్వంతో పని లేకుండా 5ఏళ్లకు ప్రభుత్వం తనకిచ్చే 60లక్షల వేతనాన్ని ముందుగానే తన నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలకు ప్రకటించారు. రోజూ తన నియోజకవర్గంలో తిరుగుతున్నాడు. ప్రతి గంట తన నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. తన నియో జకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నెల్లూరు నగరపాలక సంస్థ సహకారం తీసుకుంటున్నాడు. ఎమ్మెల్యేగా ఉండేది ఐదేళ్లే! కాలానికి వేగం ఎక్కువ. మనం అటు ఇటు తిరుగుతుండే సరికే మళ్ళీ ఎన్నికలొస్తాయి. ఈలోపు నమ్మి ఓట్లేసిన ప్రజలకు నాలుగు మంచి పనులు చేయాలనే యావ కోటంరెడ్డిది. కాని ప్రభుత్వపరంగా సహకారం లేకపోవ డంతో తన సొంత మార్గంలో ప్రజలకు సాధ్యమైనంత వరకు మంచి చేయడానికి తపన పడుతున్నాడు.

జిల్లాలో ఎమ్మెల్యేలకు ఇది గడ్డు కాలం. ఇటు ప్రజలు ఎన్నో ఆశలతో వున్నారు. అటు ప్రభుత్వం నుండి రూపాయి రావడం లేదు. ఈ ఐదేళ్లు వాళ్లకు పరీక్షా సమయమే!

# కాంగ్రెస్‌కు దూరమైన 'రెడ్లు'

***రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీకి బలమైన దన్నుగా నిలిచింది రెడ్డి సామాజిక వర్గమే. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే కాంగ్రెస్‌లో నడిచిందంతా కూడా రెడ్ల హవానే! అధికసంఖ్యలో రాష్ట్ర ముఖ్యమంత్రులుగా చేసింది కూడా 'రెడ్డి' వర్గీయులే!***






దివంగత నేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి మరణానంతరం వై.యస్. జగన్మోహన్‌రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించడం, రాష్ట్ర విభజన వంటి పరిణామాలు ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు రెడ్లను దూరం చేస్తూ వచ్చాయి. ఎక్కువ శాతం మంది రెడ్లు వైయస్సార్ కాంగ్రెస్‌లోకి పోగా తక్కువ శాతంలో తెలుగుదేశంలోకి పోయారు.

నెల్లూరుజిల్లాలోనూ కాంగ్రెస్ అంటే మొదటి నుండి 'రెడ్ల' పెత్తనమే. జిల్లాలో బెజవాడ, నేదురుమల్లి, నల్లపరెడ్డి, మేనకూరు, ఆనం, మాగుంట, మేకపాటి వంటి రాజకీయ కుటుంబాలన్నీ కూడా కాంగ్రెస్‌లో ఉన్నవే! 2009 ఎన్నికల వరకు కూడా జిల్లాలో 'రెడ్లు' కాంగ్రెస్‌కు అండగానే నిలిచారు. కాంగ్రెస్ వెన్నంటి నడిచారు. వై.యస్. మరణానంతరం తలెత్తిన పరిణామాలతో జిల్లాలోని రెడ్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌కు దూర మవుతూ వచ్చారు. జగన్ వైకాపాను పెట్టాక, మేకపాటి సోదరులు ఆ పార్టీలో చేరి పోయారు. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా వైకాపాలో చేరడం జరిగింది. ఇక నియోజకవర్గాల స్థాయిలో చూస్తే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘ వేంద్రరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి వంటి నాయకులు కాంగ్రెస్‌ను వదిలి జగన్ వెంట నడిచారు. 2014ఎన్నికలప్పుడు ఇంకొందరు రెడ్లు కాంగ్రెస్‌ను వదిలి వైకాపా లేదా తెలుగుదేశంలలో చేరి పోయారు. మాగుంట శీనయ్య టీడీపీలో చేరాడు. ఎన్నికలయ్యాక ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి వంటి వాళ్లు కాంగ్రెస్‌ను వదిలేసి తెలుగుదేశంలోకి వెళ్లారు.

కాంగ్రెస్‌లో ప్రధానమైన రాజకీయ కుటుంబాలుగా మిగిలివున్నదల్లా ఆనం, నేదురుమల్లి వారివే! నేదురుమల్లి జనా ర్ధన్‌రెడ్డి మరణించాక ఆ వర్గం ప్రాబల్యం కోల్పోయింది. ఆయన కుమారుడు రాం కుమార్‌రెడ్డి కాంగ్రెలో పడుతూ లేస్తూ వచ్చాడు. కాంగ్రెస్‌లో ఇమడలేక ఇప్పుడు ఆ పార్టీని వదిలి బీజేపీలో చేరిపోయాడు.

ఇక జిల్లా కాంగ్రెస్‌లో మిగిలిన ఏకైక రెడ్డి కుటుంబం 'ఆనం'దే. జిల్లా కాంగ్రెస్‌లో ఇక వాళ్లకు అడ్డు చెప్పే వాళ్లు లేరు. అడ్డుకునే వాళ్లూ లేరు.



## రాష్ట్రం స'పోర్టు' లేకనే...

# దుగరాజపట్నంకు బ్రేక్

గత యూపిఏ ప్రభుత్వంలో దేశంలో మూడు మేజర్ పోర్టులను ఏర్పాటు చేయాలని భావించారు. అందులో ఒక పోర్టును ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఏపిలో విశాఖ జిల్లా నక్కలపల్లి, ప్రకాశంజిల్లా రామాయపట్నం, నెల్లూరుజిల్లా దురగాజపట్నంలను పోర్టుకు పరిశీలించారు. వివిధ తర్జనభర్జనల అనంతరం దుగరాజపట్నం వద్దే మేజర్ పోర్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. రాష్ట్ర విభజన బిల్లులో కూడా నాటి యూపిఏ ప్రభుత్వం ఏపికిచ్చిన హామీలలో దీనిని చేర్చింది. ఎన్నికలకు ముందు తిరుపతి ఎంపిగా వున్న చింతా మోహన్ ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేత హడావిడిగా శంకుస్థాపన చేయించా లని చూసారు గాని అది నెరవేరలేదు.

కేంద్రంలో యూపిఏ పోయి ఎన్డీఏ వచ్చింది. ఏపికి ఇచ్చిన విభజన హామీలలో దుగరాజపట్నం అలాగే వుంది. ఈ కొత్త ప్రభుత్వంలో ఈ పోర్టు పరంగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సరికదా ఇక్కడ పోర్టు అనవసరమనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఈ పోర్టుకు సంబంధించి ఇటీవల లోక్‌సభలో తిరుపతి ఎంపీ వరప్రసాద్ ప్రశ్న వేశారు. ఈ పోర్టు వుందా? లేదా? అని ఆయన నిలదీసారు. (మిగతా 10వ పేజీలో)

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


శ్రీ షిర్డి సాయిబాబా జన్మదిన, శ్రీరామనవమి మహోత్సవములు
28-3-2015 శనివారము నుండి 30-3-2015 సోమవారము వరకు
పై దినములలో ప్రతిరోజు
ఉదయం 7 గం॥ల నుండి శ్రీ బాబా వారికి
మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు
12 గంటల నుండి
సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు
జరుగును.
• పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/-లు చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది.
• పైరోజులలో ప్రతిరోజు నాలుగుపూటలా షిరిడీ హారతులు జరుగును.
• ప్రతిరోజు సాయంకాలం 7గం॥ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.
భక్తులు తమకు తోచిన విధముగా ధనరూపములోగాని, ద్రవ్యరూపములోగాని మందిర గుమస్తా వద్ద చెల్లించి తగిన రశీదును పొందవలసినదిగా కోరడమైనది. పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థప్రసాదములు స్వీకరించి, వారి కృపకు పాత్రులగుదురని ఆశిస్తున్నాము.
ఇట్లు: కార్యవర్గము
శ్రీ షిర్డి సాయిబాబా మందిరము
గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్. 2327771.

## అమ్మవారిని దర్శించుకున్న దేవాలయాల మంత్రి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావు ఆదివారం నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంకు వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మంత్రి ఆలయ రికార్డులను కూడా పరిశీలించి మార్పులు చేర్పులు సూచించారు. మంత్రికి ఆలయ సిబ్బంది మేళతాళాలతో స్వాగతం పలికి తర్వాత సాగనంపారు.

## స్మైల్‌కు ఏపి ట్రాన్స్‌కో గుర్తింపు

ఏపి ట్రాన్స్‌కో ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలు అందించేందుకు తమ స్మైల్ హాస్పిటల్‌కు ప్రభుత్వ అనుమతి లభించినట్లు దంత వైద్యశాల క్లినికల్ హెడ్ డాక్టర్ కవితారెడ్డి తెలిపారు. ఏపి ట్రాన్స్‌కో ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇహెచ్‌యస్ గుర్తింపు ఉన్నందున ఏపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు క్యాష్‌లెస్ చికిత్సలు పొందుతున్నారని తెలిపారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు చికిత్సలు చేసేందుకు అనుమతులు రానున్నాయని పేర్కొన్నారు.

## దేహ సమర్పణ



నెల్లూరు పొదలకూరు రోడ్డుకు చెందిన చెన్నూరు జనార్ధన్(65) ఈనెల 18న గుండెజబ్బుతో మరణించారు. ఆయన కుటుంబసభ్యుల అభ్యర్ధన మేరకు జనార్ధన్ దేహాన్ని పినాకిని బాడీడోనార్స్ అర్గనైజేషన్ వారు స్వీకరించారు. వెంటనే మాడరన్ ఐ హాస్పిటల్ వారి తోడ్పాటుతో జనార్ధన్ కళ్లను సేకరించడం జరిగింది. అనంతరం జనార్ధన్ దేహాన్ని వైద్యశాస్త్ర పాఠాన్ని బోధించేందుకు శాస్త్ర విభాగ ప్రధానాచార్యులు నీలి జయశ్రీకి స్వాధీనపరిచారు.

# నెల్లూరు కబుర్లు

## పరీక్షల సీజన్



నెల్లూరు రోడ్ల మీద ఎక్కడ చూసినా పరీక్షల సందడి కనిపిస్తుంది. నిన్నటివరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగాయి. పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద వారిని వదలడానికి, పరీక్ష కాగానే తిరిగి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు కష్టపడ్డారు. చివరి పరీక్ష వ్రాసిన వెంటనే ఇంటర్ విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. సంవత్సరం పాటు చదివిన పుస్తకాలను ముక్కలు ముక్కలుగా చించి గాల్లోకి విసిరేసి ఈ పుస్తకాల పీడ వదిలిందన్నట్లు సంబరపడ్డారు. ఓ పక్క 'స్వచ్ఛభారత్' అని ప్రధాని నరేంద్రమోడీ నెత్తి నోరు బాదుకుని చెబుతుంటే చదువు, సంస్కారం అలవర్చుకోవాల్సిన విద్యార్థులు పుస్తకాలను చించి రోడ్లపై వేయడం ఏ సంస్కారమో అర్థం కాదు. విద్యాలయాలలో వీరికి నేర్పుతున్న చదువు ఇదేనా? ఇంటర్ పరీక్షలు అయ్యాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. నెల్లూరులోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి ఎక్కువగా కనిపిస్తుంది. ఇక ఏప్రిల్ చివరిదాకా పరీక్షల సీజనే!

## దోస్త్ మేరా దోస్త్...

నెల్లూరుజిల్లా ఎస్పీ ఎస్. సెంథిల్‌కుమార్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ చక్రధర్‌బాబు మంచి స్నేహితులు. చక్రధర్‌బాబు, సెంథిల్‌కుమార్ ఒకే బ్యాచ్ ఐపిఎస్ అధికారులు కావడంతో వాళ్ల స్నేహం అక్కడ కుదిరింది. ఇద్దరూ నెల్లూరుజిల్లాలోనే పనిచేస్తుండడంతో ఇప్పుడు ఇంకా ముదిరింది. ఆదివారం ఈ ఇరువురు తమ కుటుంబ సభ్యులతో మైపాడు బీచ్‌కు వచ్చి, తీరంలో అలలతో ఆడుకున్నారు. హరిత రిసార్ట్స్‌లో కొంతసేపు సేద తీరి ఎంజాయ్ చేశారు. బుధవారం ఎస్పీ సెంథిల్ కుమార్ బదిలీ కావడంతో ఈ జిల్లాలో వీరిద్దరి చివరి సరదా కలయిక ఇదే కావడం విశేషం.

## మన పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

జిల్లా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి ఉగాది సందర్భంగా రాష్ట్రప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలు ప్రకటించింది. వారిలో సిసిఎస్ ఎస్ఐ షేక్ షరీఫ్‌కు ఎంతో ప్రతిష్టాకరమైన మహోన్నత సేవా పతకం లభించడం జిల్లా పోలీసుశాఖకే గర్వకారణం. అదేవిధంగా, పోలీసు శాఖలో పనిచేస్తున్న మరికొందరికి కూడా ఉత్తమ సేవా పతకాలు, పోలీసు సేవా పతకాలు లభించడం సంతోషకరం. స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా పనిచేస్తున్న బి.వెంకటరామారావు, గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాసులు, ఎఆర్ ఎస్ఐ కె.రమణయ్య, కావలి టూటౌన్ కానిస్టేబుల్ కె.మధుసూదనరావు, ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వర్లు, సిఐడి విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ గోవిందస్వామి కుప్పుస్వామిలకు ఉత్తమసేవా పతకాలను అందుకున్నారు. ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.ప్రవీణ్‌కు రాష్ట్ర పోలీసు సేవాపతకం లభించింది. అగ్నిమాపకశాఖలో ఎడిఎఫ్‌ఓగా వున్న ఎస్.శ్రీనివాసరావుకు ఫైర్‌సర్వీస్‌లో ఉత్తమసేవా పతకం లభించింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కానిస్టేబుల్‌గా వున్న వై. మధుసూదనరావు, వెంకటగిరి ఏపిఎస్పీ తొమ్మిదవ బెటాలియన్‌లో పనిచేస్తున్న ఆర్‌ఎస్ఐ ఆర్.విద్యాసాగర్, బి.మోహన్‌లకు ఉత్తమ సేవాపతకాలు లభించాయి. తమ సేవలతో జిల్లా పోలీసుశాఖకు రాష్ట్రస్థాయిలో మంచిపేరు తెచ్చిన వీరందరికీ 'లాయర్' శుభాకాంక్షలు.

## అపోలోలో అధునాతన శస్త్రచికిత్స




నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో లాప్రోస్కోపిక్ హిస్టరెక్టమి అనే అధునాతన పద్ధతిలో శస్త్రచికిత్సను నిర్వహించినట్లు ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వినుతారెడ్డి తెలిపారు. మార్చి 22వతేదీన ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ ల్యాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలో నొప్పి తక్కువగా ఉండి, చికిత్స జరిగిన మూడుగంటల తర్వాత రోగి అటు ఇటు తిరగడం వంటివి చేయవచ్చన్నారు. శస్త్ర చికిత్స జరిగిన తర్వాత హెర్నియా భయం ఉండదని, మెదడు, గుండె వంటి వాటికి రక్తం సరఫరా చేసే నాళాల్లో అడ్డంకులు ఏర్పడకుండా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా జరిపే శస్త్రచికిత్స వల్ల రోగికి నొప్పి ఎక్కువగా వుండి ఒకటి రెండురోజులు మంచం మీదే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడేదని, దీనివల్ల రక్త సరఫరాలో ఇబ్బంది ఏర్పడేదన్నారు. కాని ఈ పద్ధతిలో రోగి వెంటనే కోలుకొని సాధారణ జీవితంలోకి అడుగుపెడతాడని, తన కుటుంబసభ్యులతో సంతోషంగా గడుపుతాడని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ రోహిణి, డాక్టర్ విష్ణువర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.



సైకత శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు

## ఈతగాళ్ల ఉగాది సంబరం

పినాకినీ స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 21వ తేదీ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పవిత్ర పినాకినీ నదిలో సైకత శివలింగానికి విశేష పూజలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అలంకార్ పెంచలయ్య, కార్పొరేటర్లు రూప్‌కుమార్ యాదవ్, నూనె మల్లిఖార్జునయాదవ్, మాజీకార్పొరేటర్ శరత్‌చంద్ర, నాగేశ్వర రావు, కిషోర్‌బాబు, మురళీకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, శేషు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపుంతలు తొక్కిన లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని

### • అలరించిన ఉగాది కవి సమ్మేళనం

సాధారణంగా లయన్స్‌క్లబ్ వంటి సేవా సంస్థలు సమాజసేవకే ప్రధమ ప్రాధాన్యత ఇస్తుంటాయి. అయితే, ఈసారి లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని వారు కొంత వినూత్నంగా, సామాజిక సేవతో పాటు కవిత్వానికి కూడా పెద్ద పీట వేస్తూ ఎంతో విశిష్టంగా కవిసమ్మేళనం నిర్వహించి అందరి ప్రశంసలూ అందుకున్నారు.

అంతేకాదు, ఉగాదిని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని మహిళా సభ్యులకు కూడా కవితా పోటీలు నిర్వహించడం విశేషం. 'లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని' ఆధ్వర్యంలో, ప్రముఖ కవి చిన్ని నారాయణరావు సారధ్యంలో ఈ నెల 21న రంగనాయకులపేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఈ కవిసమ్మేళనం అందరినీ బాగా ఆకట్టుకుంది. అందులోనూ నిర్వహించినవారు ప్రముఖ కవి కావడంతో, ఆద్యంతం కవి సమ్మేళనం సకల జనరంజకంగా సాగింది. ఈ కార్యక్రమంలో చిన్ని నారాయణరావు మాట్లాడుతూ, సమాజ హితాన్ని కోరుతూ, ప్రజలను చైతన్యవంతం చేసేదే నిజమైన



సాహిత్యమని, లయన్స్‌క్లబ్ వంటి సంస్థలు సామాజిక సేవను నిర్వహిస్తూనే, కవిత్వాన్ని కూడా ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ఇలాంటి కవిసమ్మేళనాలు నిర్వహించడం ఎంతైనా హర్షణీయమని అన్నారు. అనంతరం, కవులు తమ కవితలతో శ్రోతలకు వీనులవిందు చేశారు. ఈ కవిసమ్మేళనంలో చిన్ని నారాయణరావుతో పాటు, ప్రముఖ కవులు, కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, బొగ్గవరపు ఇందిర, గాలి లలిత, ఏటూరు నాగేంద్ర, డాక్టర్ ఈదూరు సుధాకర్, ఈతకోట సుబ్బారావు, వంజవాక సతీష్, గుండాల నరేంద్రబాబు, అవ్వారు శ్రీధరబాబు, అలెగ్జాండర్, బొగ్గవరపు రాధాకృష్ణ, మద్దూరు శ్రీనివాసులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీమతి వై.అమృతవల్లి చేతుల మీదుగా కవులందరికీ సత్కారం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శరత్‌బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదంగా జరిగింది. తొలుత, లయన్స్ క్లబ్ మహిళా సభ్యులకు జరిగిన కవితల పోటీల్లో విజేతలకు చిన్ని నారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

## రేస్‌లో 'ఓపన్‌డే' సందడి



నెల్లూరు హరనాథపురంలోని రేస్ నందు ఒపన్‌డే సెలబ్రేషన్స్‌ను మార్చి 20వ తేదీ ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రత్నం విద్యాసంస్థ అధినేత కె.వి.రత్నం, గౌరవ అతిథిగా ప్రముఖ భౌతికశాస్త్ర అధ్యాపకులు కోదండరామయ్య(కోరా) విచ్చేసి జ్యోతిప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన అనేక నమూనాలను, కళాకృతులను చూసి ఆనందించారు. విద్యార్థులను స్వయంగా వాటి వివరాలు అడిగి తెలుసుకొని వారిని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రకృతిలో కనపడే అనేక రకాల పుష్పాలు, కూరగాయలు, జంతువులు, కీటకాలు మొదలైన వేషధారణలతో చూపరులను అబ్బురపరిచారు. ప్రైమరీ విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించిన అనేర రకాల నమూనాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా దేవాలయాలు, రామాయణం, దశావతారాలు, భారతదేశంలో గొప్ప కళాకృతులు, ప్రాచీన కట్టడాలు మొదలైనవి ప్రదర్శించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయినులకు డైరెక్టర్ శ్రీమతి రమావేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శాంతి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి విద్యార్థులను అభినందించారు.

# పొలాల్లోనే స్పందించాడు



ఒక మంచి రాజకీయనాయకుడు అనిపించుకోవడం కొంచెం కష్టం. ఒక మంచి ప్రజానాయకుడు అనిపించుకోవడం ఇంకాకష్టం. సమస్యలపై స్పందించే గుణమే నాయకులను ప్రజానాయకులుగా మారుస్తుంది. ఈరోజు జిల్లా తెలుగుదేశం పార్టీలోని నాయకులు, కార్యకర్తలు చాలా మంది సోమిరెడ్డి మంత్రిగా వుంటే బాగుండేదని అనుకుంటున్నారు. ఎందుకంటే సమస్యమీద ఎవరన్నా ఆయన వద్దకు పోతే వెంటనే స్పందిస్తాడు. సంబంధిత అధికారికి వెంటనే ఫోన్‌చేసి సమస్యను చెప్పడమే కాక పనిచేసి పెట్టండని చెబుతాడు. కాని కొందరు నాయకులు ఆ విధంగా స్పందించరు. ఒక పనికి పదిసార్లు తిప్పుకుంటారు. ఒక్కోసారి అందుబాటులో ఉండరు.

సోమిరెడ్డి సోమవారం దగదర్తి మండలంలో ఓ ఇంటికి పరామర్శకు వెళ్ళి వస్తూ వస్తూ అక్కడే పొలాల్లోకి వెళ్లారు. రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పని చేయడం లేదని, నిబంధనల పేరుతో అధికారులు తిప్పుకుంటున్నారని, ఈ తిప్పలు పడలేకే పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నామని రైతులు చెప్పారు. రైతుల బాధలు విన్న సోమిరెడ్డి వెంటనే జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌కు అక్కడనుండే ఫోన్ చేశారు. అక్కడ నెలకొన్న పరిస్థితులను ఫోన్‌లోనే జేసీకి వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇక్కడ సోమిరెడ్డి ఫోన్‌తో సమస్య పరిష్కారం కావచ్చు, కాకపోవచ్చు కూడా! కాని ప్రజలు సమస్యలు చెప్పుకున్నపుడు ఏ విధంగా స్పందించాలనేది చాలామంది నాయకులు సోమిరెడ్డి లాంటి వారిని చూసి నేర్చుకోవాలి.



## ఆర్భాటంగా పార్టీ మారిన
# నేదురుమల్లి కుమారుడు

మాజీముఖ్యమంత్రి, కరుడుగట్టిన కాంగ్రెస్‌వాది స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కుమారుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మార్చి 22వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు సమక్షంలో భారతీయ జనతాపార్టీలో చేరారు. కాంగ్రెస్‌పార్టీకి ముందురోజే ఆయన రాజీనామా చేశారు. 22వ తేదీ నెల్లూరులోని ఓ వివాదాస్పద ఫంక్షన్‌హాల్‌లో తన కార్యక్రమం పెట్టుకున్నారు. బీజేపీలో చేరుతున్న సందర్భంగా నగరమంతా హంగామా చేశారు. ఫ్లెక్సీ కటౌట్‌లు, బీజేపీ నాయకుల ఫోటోలతో కూడిన బ్యానర్‌లు భారీగానే ఏర్పాటు చేయించారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, విశాఖ ఎంపి కె.హరిబాబు రాంకుమార్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి గురించి నాలుగు మంచిమాటలు చెప్పి ఆయన కొడుకు రాంకుమార్‌రెడ్డి బీజేపీలో చేరినందుకు ఆనందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీకేంద్రమంత్రి దగ్గుపాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సత్యనారాయణ, ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

అయితే తమకు మాటమాత్రం చెప్పకుండా నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని చేర్చుకుంటుండడం పట్ల అలక వహించిన సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి వంటి బీజేపీ సీనియర్ నాయకులు ఈ కార్యక్రమానికి ఎగ్గొట్టారు.

• ఉగాది

# బి.వి.యన్ సన్మానాలు



వివిధ రంగాలలో తమతమ ప్రతిభా ప్రావీణ్యాలతో రాణిస్తున్న కొంతమందికి మన్మథనామ సంవత్సరాన్ని పురస్కరించుకుని పురస్కార కార్యక్రమాన్ని "విక్రమ సింహపురి సంగీత సభ" వేదికగా బి.వి.నరసింహం నిర్వహించారు. ఈ సభలో సంగీతం, శాస్త్రీయ సంగీతం, సాహిత్యం, ఆధ్యాత్మికం, నృత్యం, వైద్యం, పౌరాణిక నాటకం, సమాజసేవ వంటి రంగాలలో తమ సేవలు అందిస్తున్న యనమండ్ర నాగదేవిప్రసాద్, జె.బాలార్క, ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, సురభిగాయత్రి, డా॥ బి.మాలకొండయ్య, యస్.వి.రత్నం, గండవరపు బలరామిరెడ్డి, చిన్నారి సుమేధను సత్కరించి ఉగాది పురస్కారాన్ని నెల్లూరునగర మాజీశాసన సభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చేతులమీదుగా అందించగా మాదరన్ స్కూల్ విజయకుమార్‌రెడ్డి సహకరించాడు.

సన్మానగ్రహీతలను అభినందిస్తూ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తమ ప్రసంగాన్ని ఆరంభించి సంస్కృతీ సంప్రదాయం, కట్టుబాట్లు నిత్యం పాటించినప్పుడే మానవ జీవితం ధన్యమౌతుందని చెప్పాడు. మొత్తం రెండుగంటల సేపు జరిగిన సన్మాన సభా కార్యక్రమంలో గంటకుపైగా బి.వి.నరసింహం చేసిన ఉపన్యాసం, ఉపోద్ఘాతం హైలెట్‌గా నిలిచాయి. సత్కార గ్రహీతలకు 'లాయర్' అభినందనలు.



# మా బ్యాంకు బాగా పనిచేస్తుంది

**- డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు**



ఇతర బ్యాంకులతో పోలిస్తే తమ బ్యాంకు పనితీరు ఎంతో బాగుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. మార్చి 23వ తేదీన నెల్లూరులోని బ్యాంకు కార్యాలయంలో బోర్డు సమావేశం, మహాజన సభ జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో ధనుంజయరెడ్డి మాట్లాడారు. గతంలో రాష్ట్ర విభజన, సమైక్యాంధ్ర ఆందోళనలు వంటివాటి కారణంగా వ్యాపారం దెబ్బతిందని, వాటిని సర్దుకుని బ్యాంకును ప్రగతిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 2న కో–ఆపరేటివ్ బ్యాంకు విభజన జరుగుతుందని, కొత్త పాలక విధానాలు అమలులోకి వస్తాయన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను రాష్ట్రంలో రెండు లేదా మూడో స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 300కోట్లు డిపాజిట్ల సేకరణ, 800కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జిల్లాలో 79ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, 22సహకార బ్యాంకు సంఘాలు ఉన్నాయని, వాటిలో మూడు బ్యాంకులను డిసిసిబిలో విలీనం చేసామన్నారు. ఆత్మకూరు రూరల్ బ్యాంకును కూడా విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 28సొసైటీ లను నాబార్డ్ మల్టీపర్పస్ సొసైటీలుగా గుర్తించిందని, ఈ సొసైటీలలో కూడా వ్యవసాయేతర ఋణాలు అందించే అవకాశముంటుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 34సొసైటీలలో కంప్యూటరీకరణ జరిగిందని, ఈ ఏడాది చివరకు మిగిలిన సొసైటీలలో కూడా పూర్తి చేస్తామన్నారు.

# 'మేక్ ఇన్ ఇండియా'కు నిదర్శనంగా శ్రీసిటీ

**- శ్రీసిటీ పర్యటనలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు**

ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యమైన మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియాకు నిజమైన నిదర్శనంగా శ్రీసిటీ సెజ్ పని చేస్తోందంటూ కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాల శాఖామాత్యులు వెంకయ్యనాయుడు అన్నారు. 21వ తేదీ ఉదయం 11గంటలకు ఆయన శ్రీసిటీ పర్యటనకు విచ్చేశారు. హెలిప్యాడ్ వద్ద శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఘన స్వాగతం పలికారు. తిరుపతి ఎంపి వరప్రసాదరావు, రాష్ట్ర పరిశ్రమల కార్యదర్శి ఎస్ఎస్ రావత్, చిత్తూరుజిల్లా కలెక్టర్ సిద్ధార్థజైన్, శ్రీసిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.కె.చౌదరిలు కూడా కేంద్రమంత్రికి స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన శ్రీసిటీ సెజ్‌లో పర్యటించి అక్కడ జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించారు.

అనంతరం బిజినెస్ సెంటర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ నుంచి స్మార్ట్‌సిటీల ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలులోకి వస్తుందన్నారు. స్మార్ట్‌సిటీ అంటే సంబంధిత నగరం లేదా పట్టణంలో నివసించే ప్రజలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తేవడమేనని, 24గంటలూ నిరంతర విద్యుత్, పరిశుభ్రమైన త్రాగునీటి సరఫరా, విశాలమైన రహదారులు, ఫ్లైఓవర్లు, భూగర్భకేబుల్, మురికినీటి కాలువల వ్యవస్థ ఉంటాయని అన్నారు. ప్రభుత్వపరమైన కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగుతాయని, ఆన్‌లైన్ డిజిటల్ సేవలు పెరుగుతాయని, పూర్తిగా కాలుష్యరహిత వాతావరణంలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించే దగ్గర నుంచి నగరంలో శాంతిభద్రతల నిర్వహణ దాకా వ్యవస్థలన్నీ బాగా మెరుగుపడతాయని, ఈ సదుపాయాలన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకుని వుంటాయని వెంకయ్య తెలిపారు. శ్రీసిటీ ఎండి రవీంద్రసన్నారెడ్డి శ్రీసిటీకి విచ్చేసిన వెంకయ్యను జ్ఞాపికతో సత్కరించారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్‌కు ఉత్తమ సేవా పతకం



గూడూరు సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి బాదిపల్లి శ్రీనివాస్ పోలీసుశాఖకు అందించిన సేవలను ప్రశంసిస్తూ ఉగాది పర్వదినాన ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ 'లాయర్'తో మాట్లాడుతూ 1985వ సంవత్సరంలో పోలీసుశాఖలో సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా కర్నూలు రేంజిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేసి ప్రజల మన్నలను పొందినట్లు చెప్పారు. 1997లో ఓఎస్‌ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొంది, ఏసిబిలో పనిచేస్తూ ఐక్య రాజ్యసమితిచే నియమించబడిన మిషన్ కొసావోకు ఎన్నికై మే 2000 నుండి మే 2001 వరకు కొసావోలో పనిచేసి ఐక్య రాజ్య సమితి యొక్క మన్ననలను పొంది, వారి నుండి రెండు అవార్డులను సొంతం చేసుకున్నానని చెప్పారు. 2001 సంవత్సరంలో రెగ్యులర్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొంది వివిధ శాఖలలో ఎసిబి, పిటిసి, ఏపి ట్రాన్స్‌కో, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌లో పనిచేసి ఇటు అధికారులతో పాటు ప్రజల నుండి ప్రశంసలు పొందినట్లు తెలిపారు. తన యొక్క సేవలను ప్రశంసిస్తూ అధికారులు 135రివార్డులు, అందులో 23క్యాష్ రివార్డులు, 7ఎమ్ఎస్‌ఇఎస్, 104 జీఎస్ ఇఎస్ మరియు ప్రశంసాపత్రాలతో ప్రశంసించారని, 2000 సంవత్సరంలో ఉగాది రోజు పోలీసు సేవా పతకంతో సత్కరించినట్లు, 2011వ సంవత్సరంలో డిప్యూటి సూపరింటెండ్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొంది తిరుపతి పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో, అనంతపురం ఎసిబి విభాగంలో, చిత్తూరుజిల్లా రేణిగుంట డిఎస్పీగా పనిచేసి 2014అక్టోబర్ 12వ తేదీన గూడూరు డిఎస్పీగా నియమింపబడినట్లు వివరించారు. తాను రేణిగుంటలో డిఎస్పీగా పనిచేసేటప్పుడు కరుడుగట్టిన ఎర్రచందనం దొంగలను షుమారు 729 మందిని పట్టుకొని వారి వద్ద నుండి 929 ఎర్రచందనం దుంగలు, 16 వివిధ రకాల వాహనాలు షుమారు 3కోట్ల రూపాయల మేరకు స్వాధీనం చేసుకుని వారిపై 41 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫారెస్టు అధికారుల హత్య కేసును స్వల్పకాలంలో చేధించి 349మంది ఎర్రచందనం దొంగలను ఒక్కసారిగా అరెస్టు చేసినట్లు తెలిపారు.

గూడూరు డిఎస్పీగా నియమించినప్పటి నుండి అంతర్‌రాష్ట్ర దొంగ అయిన బాబు భాగ్యరాజ్‌ను అరెస్ట్ చేసి షుమారు 13దొంగతనం కేసులను చేధించినట్లు, చిల్లకూరు మండలం చీమలతిప్ప వద్ద జరిగిన బందిపోటు కేసును 24గంటల్లో చేధించి అధికారుల మన్ననలను పొందినట్లు, అంతేకాకుండా నాయుడుపేట, సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన లారీ మరియు లారీలలో దొంగతనం కేసులను స్వల్ప కాలిక వ్యవధిలో ఛేదించినట్లు తెలిపారు. పోలీస్‌శాఖకు అందించిన సేవలను ప్రశంసిస్తూ ప్రభుత్వం వారు ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్తమ సేవా పతకంతో సత్కరిస్తున్నట్లు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయనకు పలువురు పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

గూడూరు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో సోమవారం పురపాలక పద్దు (బడ్జెట్)పై ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో 2015-16 ఆర్ధిక సంవత్సరానికి రూ. 18,09,97,500 పద్దును కేటాయించడంతో అందరూ ఆమోదించారు. పురపాలక పద్దులో విద్యుత్‌కు రూ. 1.30కోట్లు కేటాయించడం ఎందుకని, గతంలో 50లక్షలు మాత్రమే కేటాయించారని కౌన్సిలర్ నాగులు ప్రశ్నించారు. పట్టణంలో పన్నులు చెల్లించాల్సిన పేర్లు రెండుసార్లు నమోదు చేసారని, ఎన్నిసార్లు చెప్పినా స్పందన లేదన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు, వాటి వివరాలు, తదితర విషయాలపై చర్చలు జరిగి, ఎట్టకేలకు పురపాలక పద్దుకు ఆమోదం లభించింది. తెలుగుదేశంపార్టీ తరపున వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ పద్దుపై తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని ఏకగ్రీవంగా తాము ఆమోదిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలోనే 2014-15లో కేటాయించిన పద్దులో రూ. 21,10,45,500 వసూళ్లు కాకపోవడంతో రూ. 16,11,19,500 అంచనాలతో సవరించారు. కాగా పురపాలక విద్యుత్ సిబ్బందిపై తెలుగుదేశంపార్టీ నాయకుడు దురుసుతనాన్ని నిరసిస్తూ వైకాపా సభ్యులు సమావేశానికి హాజరుకాకుండా బయటే కూర్చొని నిరసన తెలిపారు. దీంతో సమావేశంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు మాత్రమే కూర్చొని ఉండడంతో కొద్దిసేపు సమావేశం సాగలేదు. ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మెన్ వారిని బుజ్జగించడంతో సమావేశానికి హాజరయ్యారు.

## ప్రభుత్వ భూములను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్

గూడూరు డివిజన్‌లోని ప్రభుత్వ భూముల వివరాలను గుర్తించాలని ఆర్డీవో రవీందర్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో డివిజన్‌లోని తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. భూముల వివరాలపై పూర్తి నివేదిక ప్రభుత్వానికి పంపించాలని, ఆలస్యం చేయకుండా సేకరించాలన్నారు. నెల్లూరులో ఆధార్ సీడింగ్‌పై సమావేశం ఉన్నందున గ్రీవెన్స్‌ను మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టంరాజు కండ్రిగలో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించాలని సర్పంచి వినతిపత్రం అందజేశారు. కోట మండలం రామాపురానికి చెందిన మహిళలు సాగు చేసుకొన్న భూములు ఆక్రమమించారని ఫిర్యాదు చేశారు. ఇంకా పలు మండలాల నుంచి పలువురు భూసమస్యలపై, మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదంటూ ఆర్డీవో రవీందర్‌కు వినతులు ఇచ్చారు.

ఈ సమావేశంలో డివిజన్‌లోని తహశీల్దార్లు సి.వెంకటనారాయణమ్మ, శ్రీకాంత్ కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పంచాంగ శ్రావణంలో ఇ.ఓ. రామిరెడ్డి, మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి

## భక్తిశ్రద్ధలతో మన్మథనామ ఉగాది

దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో 21వ తేదీ మన్మథనామ ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. బెంగుళూరు నుంచి తెప్పించిన పూలతోపాటు మామిడి, అరటితోరణాలతో ఆలయంలో ఉదయం ఉగాది పచ్చడిని వచ్చిన భక్తులకు పంచి పెట్టారు. గోపురాలను విద్యుదీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలంకార మండపంలోని ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ భిక్షాల గోపురం ఎదురుగా ఉన్న భక్తకన్నప్ప ఆలయంలో శివభక్తుడైన భక్త కన్నప్పకు ప్రతియేటా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ఈ యేడాది కూడా శ్రీ మన్మథనామ సంవత్సరాదిని పురస్కరించుకుని మేళతాళాలతో శాస్త్రోక్తంగా భక్తకన్నప్ప ఆలయానికి సారెను తీసుకొచ్చారు. అనంతరం భక్తకన్నప్ప ఆలయంలో ఉగాది సందర్భంగా అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ మండపం వద్ద పంచాంగ శ్రావణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి, ఎఇఓ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పేట రాధారెడ్డి, పిఆర్ఓ హరిబాబు, ఎపిఆర్ఓ నాగయ్య ఆలయాధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన పండితులు ములుగు రామలింగేశ్వరప్రసాద్ సిద్ధాంతి పంచాంగ శ్రావణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు పొంచి ఉన్నాయన్నారు. రైతన్నతోపాటు పశుసంపదకు గడ్డుకాలం తప్పదన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో దోపిడీరాజ్యం అధికంగా ఉంటుందన్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో భారత్ ఆర్థికంగా రాణించ లేదన్నారు. అటవీ సంపద బాగా తగ్గిపోతుందన్నారు.



అన్నదానం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అంజూరు తారక శ్రీనివాసులు

## స్వామి వివేకానంద పాఠశాల 38వ వార్షికోత్సవం




నృత్యం చేస్తున్న బాలికలు



మాట్లాడుతున్న సినీనటుడు షఫీ

గూడూరులోని స్వామి వివేకానంద పాఠశాల 38వ వార్షికోత్సవం 22వ తేదీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు షఫీ పాల్గొని మాట్లాడుతూ ఏ రంగంలోనైనా గురువు బాధ్యత ఉన్నతమైనదని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఒత్తిడితో చదివించవద్దని, వారి మనస్సు తెలుసుకొని ఇష్టాలను ప్రోత్సహించాలని సూచించారు. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తే భావి తరాలకు ఎంతో సేవ చేసిన వారమవుతామన్నారు. తనది చిత్తూరుజిల్లా చంద్రగిరి అని, ఇప్పటివరకు 56చిత్రాల్లో నటించగా, ఛత్రపతి, ఖలేజా చిత్రాలు మంచిపేరు తెచ్చాయన్నారు. దర్శకుడు కృష్ణవంశీ దగ్గర నటులకు శిక్షణ ఇచ్చేవాడినని, ఖడ్గం సినిమాతో అవకాశం వచ్చిందన్నారు. తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయంలో బీకాం డిగ్రీ, పీజీలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఢిల్లీలో అభ్యసించానన్నారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రమోహన్, వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగులకు పనిసామర్థ్యము, అధికారుల సహకారం బాగుంటుంది. వస్త్ర ఆభరణ ఫ్యాన్సీ హోటల్ వాణిజ్యాలకు ఆదాయం పెరుగుతుంది. బిడ్డల శుభకార్య విద్యా విషయాలపై శ్రద్ధ చూపుతారు. షేర్లు లాభిస్తాయి. చేపట్టిన పనులు నిదానంగా జరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఇంట బయట ఆర్థిక వ్యవహారాలు జరిపేటప్పుడు జాగ్రత్త అవసరం. ముఖ్యపత్రాలు, డబ్బు జాగ్రత్త పరచుకొనాలి. భూ సంబంధమగు లావాదేవీలు జరుగుతాయి.. ఆర్థికంగా పెద్దగా ఇబ్బందులుండక పోవచ్చును. తొందరపాటు వ్యవహారాలు చేయకుండా ఆలోచించి నిర్ణయాలు చేయండి. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అదనపు ఖర్చులుండినా ఇబ్బందిపడరు. ఆర్థిక వ్యవహారాలు, సొంత పనులకు ఇతరులపై పురమాయించవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొనడం మంచిది. కుటుంబ వ్యక్తుల మధ్య సయోగ్యత బాగుంటుంది. బంధువర్గం అనారోగ్య వార్తలు వింటారు. పనులు నిదానంగా జరుగుతుంటాయి. స్పెక్యులేషన్‌లు లాభాలనందిస్తాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. షేర్ మార్కెట్ లాభాలలో ఉంటుంది. వివాహ ప్రయత్నాలు ఫలించగలవు. ఉద్యోగులకు తమ పైఅధికారులననుసరించి పోవడం మంచిది. వ్యాపారవర్గాల వారికి కొంత ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఆదాయమునకు ధీటుగా ఖర్చులు పెరుగుతాయి. గడిచిపోయిన విషయాలను మరల ముందుకుతెచ్చి విభేదాలు పెంచుకొనే స్థితి ఉన్నది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 27.03.2015 నుండి
తేది. 02.04.2015 వరకు

ఈ వారం మీనంలో రవి బుధ కేతువులు, మేషంలో కుజశుక్రులు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని, మిథున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 28 శనివారం శ్రీరామనవమి

**ముహూర్తములు**

తేది 1 బుధవారం ఉదయం 10.30 నుండి గంట 12.0లోగా మిథున లగ్నమున వివాహ గృహారంభ వ్యాపార ఉపనయనములు.

**చైత్ర మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | అష్టమి | రా॥ గం.5.18వ॥ |
| తేది. 28 | శని | నవమి | రా॥గం.5.59వ॥ |
| తేది. 29 | ఆది | దశమి | పూర్తిగ |
| తేది. 30 | సోమ | దశమి | ఉ॥గం.7.10వ॥ |
| తేది. 31 | మంగళ | ఏకాదశి | ఉ॥గం.8.44వ॥ |
| తేది. 01 | బుధ | ద్వాదశి | ఉ॥గం.10.36వ॥ |
| తేది. 02 | గురు | త్రయోదశి | ఉ॥గం.11.50వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దూరప్రయాణాలుంటాయి. బిడ్డ విద్య ఉద్యోగ వివాహ విషయాలపై శ్రద్ధ చూపుతారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు అందగలవు. ఆదాయం పెరుగుతుంది. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్యాల విషయంలో శ్రద్ధ చూపుతారు. కొత్త పెట్టుబడులు, కొత్త కాంట్రాక్టులు దొరుకును. ఉద్యోగులకు పనిసామర్థ్యం, అధికారుల ఆదరణ ఉంటుంది. ఆర్థికంగా పుంజుకుంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు, రాబడి బాగుంటుంది. మీ సలహా సూచనలు ఇతరులకు మేలు కలిగిస్తాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆదాయం వృత్తి జీవనం కలవారికి బాగుండి, వ్యాపార వర్గాలకు నిరుత్సాహం కలిగిస్తుంది. గడిచిన విషయాలపై వెలికితీసి మిమ్మల్ని విమర్శించే వారుంటారు. ఆర్థిక వ్యవహారాలలో లౌకిక ఒప్పందాలలో తొందరపడవద్దు. వ్యాపారవృద్ధి అవకాశాలు సన్నగిల్లుతాయి. సంబంధించని విషయాలలో తల దూర్చవద్దు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

పెండింగ్ వ్యవహారాలు మరల అనుకూలంగా మారతాయి. బుధ గురువారాలలో ఖర్చులు అదనంగా ఉంటాయి. ఉద్యోగులు అధికారులతోను పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో మీ ప్రణాళికలు, పథకాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తారు. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు నెరవేర్చుకొనడానికి తీవ్రంగా కృషి చేస్తారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వస్తువు, డబ్బు పోగొట్టుకొనే అవకాశం ఉన్నది. గృహ మార్పులు, గృహ వస్తు వాహన రిపేర్లు కలుగ గలవు. సెన్సెక్స్ రాబడి సంతృప్తిగా ఉండదు. సొంత పనులు వ్యవహారాలను సమయస్ఫూర్తితో నిర్వహించ వలసి ఉంటుంది. ఆర్థికావకాశాలు, వ్యాపారవృద్ధి ప్రయత్నాలు వెనుకబడతాయి. ఖర్చులు అదనంగా ఉండినా, ఇబ్బందులు ఉండకపోవచ్చును. హామీలివ్వడం, ఋణాలివ్వడం చేయవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

బ్యాంకు ఋణాలు మంజూరుకావడం, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. క్రొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాలకు అవకాశాలు కలసివస్తాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో అనుకూలత ఉండకపోవచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. కొత్త వస్తువులు కొనడం, అనుకోని ప్రయాణాలుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సొంత పనులకు ఆటంకాలు తగిలినా అధిగమించి పూర్తి చేసికొంటారు. కాని టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. గృహ నిర్మాణాలు, వస్తు గృహ వాహన మరమ్మత్తులు నిదానంగా జరుగుతాయి. నూతన పెట్టుబడులు, సంస్థల విస్తరణ, క్రొత్త సంస్థల ప్రారంభములకు అనుకూలము. బ్యాంకు ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులకు బాధ్యతల నిర్వహణలో తీరిక ఉండదు. అయినా అధికారుల సహకారం బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా సానుకూలం కాగలవు. వృత్తి ఉపాధి వర్గాల వారికి ఆదాయం పెరుగుతుంది. వ్యాపకం ఉంటుంది. అదనంగా ఖర్చులు తప్పవు. అయినా లోటు ఏమీ ఉండదు. మీ మాటకే విలువ, చెల్లుబాటు ఉంటుంది. మిమ్మల్ని విమర్శించేవారు చేరువకాగలరు.

# పిల్లల పార్కులో పెద్దల ఉగాది

శ్రీ మన్మథనామ సంవత్సర ఉగాది సంబరాలు నెల్లూరు నగరంలో 21వ తేదీ వైభవంగా జరిగాయి. చిల్డ్రన్‌పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిల్డ్రన్ పార్కులో ఉగాది పచ్చడి, ప్రసాదాలను పంపిణీ చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందరికీ అందజేశారు. ఈ సందర్భంగా చిల్డ్రన్‌పార్క్‌లో పేపర్ పాయింట్(మిని గ్రంథాలయం)ను వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీగవర్నర్ ఎం.వి. సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బిరదవోలు వెంకరెడ్డి, ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లు నాయుడు, కార్యదర్శి కొట్టే రామ్మూర్తి, ప్రధానకార్యదర్శి శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, కోశాధికారి బిజ్జివేముల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చిల్డ్రన్స్‌పార్క్ వాకర్స్ సభ్యులు

ముస్లింలు, నూర్‌బాషాలు

# ఐకమత్యంగా ఉండాలి

ముస్లింలు, నూర్‌బాషాలు ఐకమత్యంగా ఉండాలని అనంతపురం జడ్పీఛైర్మెన్, నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘ గౌరవాధ్యక్షుడు ఎం.డి. చమన్ అన్నారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూర్‌బాషాలు రాజకీయంగా ఎదగాలన్నారు. గతంలో అన్ని రాజకీయ పార్టీల్లో ముస్లిం, నూర్‌బాషా వర్గీయుల ప్రాతినిధ్యం ఉండేదని, ప్రస్తుతం వీరి సమస్యలు వినిపించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలభారత నూర్‌బాషా సంఘాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 2019నాటికి ఈ సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర కమిటిని పటిష్ట పరచి గుంటూరు, విజయవాడల మధ్య నూర్‌బాషా భవనాన్ని నిర్మించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ సలీం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సభ్యుడు ఖాదర్‌బాషా, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షకీనా, అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబాన్, నాయకులు ఇమామ్, సుభానీబీ తదితరులు పాల్గొన్నారు.

# గీతామయి వృద్ధాశ్రమంలో ఉగాది సంబరాలు

గీతామయి వృద్ధుల ఆశ్రమంలో ఉగాది సంబరాలు వేడుకగా జరిగాయి. ఆశ్రమంలోని వృద్ధులు ఉగాది పచ్చడిని తయారుచేసి అందరూ సేవించారు. ప్రభాకరస్వామి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. ఈ కార్యక్రమాన్ని ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ పర్యవేక్షించారు.

# వాలెంటీర్లకు దరఖాస్తులు

నెల్లూరుజిల్లాలోని అన్ని మండలాలకు నేషనల్ యూత్ కార్ప్స్(జాతీయ యువసేవా కార్యకర్త)లను నియమిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ ఎన్.చంద్ర మోహన్‌రెడ్డి తెలిపారు. 18 నుండి 25 సం॥ల లోపు యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని, పదవ తరగతి పాసయి వుండాలన్నారు. నెలకు రూ. 2500లు గౌరవ వేతనం ఇవ్వబడుతుందని, ఎంపికైనవారిని ఆయా మండలాల్లోనే నియమిస్తామన్నారు. దరఖాస్తులు నెహ్రూ యువకేంద్ర, శ్రీ వెంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రం, దర్గామిట్ట, నెల్లూరు చిరునామాకు ఏప్రిల్ నెల 8వ తేదీలోగా పంపుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0861-2328680 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 20వ తేదీ గోపిశెట్టి శంకరయ్య ఛారిటబుల్ ట్రస్ట్, నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 220మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 45మందిని శుక్లముల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంజులమ్మ, పి.గోపి, గోపిశెట్టి శంకరయ్య ఛారిటబుల్ ట్రస్ట్ తరపున కె.బాలసుబ్రహ్మణ్యం, యం.కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డ్రాయింగ్ పోటీలు



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శ్రీ నేతాజీ పైలెట్ స్కూల్‌లో సోమవారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశనాయకుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, వారికి గుర్తుండేలా వారి చిత్రాలను విద్యార్థులచే డ్రాయింగ్ చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ప్రసన్న, వి.సుధాకర్‌రావు, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కల్యాణ వైభవం...!



నెల్లూరులో అపార్ట్‌మెంట్ రంగానికి పునాది వేసిన పావని బిల్డర్స్ అధినేత శ్రీమతి పావని, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత అధికారి పి.వి.రాఘవరావుల కుమార్తె **లక్ష్మీ స్రవంతి - గంగాధర్** (హైదరాబాద్ వాస్తవ్యులు గూడె దశరథ రామాంజనేయులు - విద్యుల కుమారుడు)ల కల్యాణం మార్చి 8వ తేదీ హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# విద్వాన్ కిరణశ్రీకి సత్కారం

## ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉగాది పురస్కారం



ప్రముఖ సాహితీవేత్త, వక్త, ప్రభుత్వ పాఠ్యగ్రంథ రచయిత విద్వాన్ కిరణశ్రీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015 సంవత్సరం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధాని గుంటూరు జిల్లాలోని తుళ్ళూరు మండలం అనంతవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్ఠాత్మక ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ విశిష్ట పురస్కారంతో పాటు, 10,116 రూపాయల నగదు బహుమతిని కూడా అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా, సాహితీవేత్తగా విద్వాన్ కిరణశ్రీ నెల్లూరీయులందరికీ సుపరిచితులే. నెల్లూరులోని సిఎఎం ఉన్నత పాఠశాలలో చాలాకాలం ఆయన ప్రథమశ్రేణి తెలుగు పండితునిగా పనిచేసి, 2007లో ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేశారు. ఆయన రచించిన 'ఆణిముత్యాలు' కావ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 7వ తరగతి ఉపవాచకంగా నిర్ణయించింది. ఈ ఉపవాచకం 1996 నుంచి 2000వ సంవత్సరం దాకా పాఠ్యగ్రంథంగా కూడా వుండేది. ప్రభుత్వ తెలుగు పాఠ్యగ్రంథ రచయితగా ఆయన విశిష్టమైన సేవలందించారు. 7 నుంచి ఇంటర్ వరకు పలు పాఠ్యగ్రంథాలకు రచయితగా వున్నారు. విద్వాన్ కిరణశ్రీ గతంలోనూ ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను అందుకున్నారు. 1995లో న్యూఢిల్లీలో రాష్ట్రపతి నుంచి కూడా అవార్డును అందుకున్నారు. 2000లో బెంగుళూరులో మిలీనియం గోల్డ్‌మెడల్, 2011లో న్యూఢిల్లీలో రాష్ట్రీయ శిక్షా సమ్మాన్ పురస్కార్ స్పీకర్ అవార్డు, 2012లో నేపాల్ ఖాట్మండులో ఆసియా గోల్డ్ స్టార్ అవార్డు, 2013లో మలేషియాలో గ్లోబల్ అఛీవర్స్ అవార్డును అందుకున్నారు. జాషువా కవితా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులుగా గత పాతిక సంవత్సరాలుగా విఖ్యాత కవి గుర్రం జాషువా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. నెల్లూరు జిల్లా అధికార భాషా సంఘం సభ్యులుగా, తెలుగు భాషోద్యమ సమితి సభ్యులుగా, యునెస్కో క్లబ్ అధ్యక్షులుగా, జాషువా విగ్రహ కమిటీ అధ్యక్షులుగా ఆయన తన సేవ లందిస్తున్నారు. సాహితీరంగంలో విశిష్ట సేవలను అందిస్తూ, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి ఉగాది పురస్కారం అందుకున్న విద్వాన్ కిరణ్‌శ్రీకి 'లాయర్' శుభాకాంక్షలు.

# రిటైర్డ్ ఏఇలకు సన్మానం



సోమవారం నెల్లూరు అయ్యప్పగుడి వద్ద పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్కిల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిఇ నందకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఏఇలు అత్తిపల్లి పరంధామరెడ్డి, కృష్ణమూర్తి, అంజయ్య, సుధాకరయ్యలను సిఇ నందకుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఇ నాగశయనరావు, టెక్నికల్ డిఇ వెంకటేశ్వరరావు, అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేషారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# బాబుది తుగ్లక్ పాలన

**- అరుణమ్మ విమర్శ**



చంద్రబాబు నాయుడు అలనాటి ఔరంగజేబు, మహమ్మద్ బీన్ తుగ్లక్ పాలనలను గుర్తుకు తెస్తున్నాడని నెల్లూరు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్ళపల్లి అరుణమ్మ ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ విద్యుత్ వాడాల్సి వస్తుందని, సెల్‌ఫోన్ ఛార్జింగ్ మొదలు, టీవీ, ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్, ఐరన్‌బాక్స్ తదితరాలన్నీ విద్యుత్‌తోనే నడుస్తాయని, కానీ చంద్రబాబు మాత్రం పేదలపై భారం మోపడం లేదంటున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఔరంగజేబు లాగా చంద్రబాబు జుట్టుపైన కూడా పన్ను విధిస్తాడేమోనని భయంగా వుందన్నారు. రైతు, డ్వాక్రా మహిళల ఋణమాఫీ చేయకుండా పూర్తిగా మోసం చేసిన బాబుకు పన్నులు విధించే నైతిక హక్కు లేదన్నారు.

# ఆర్.వి.శేషయ్యనాయుడు జయంతి

కళాబంధు స్వర్గీయ ఆర్.వి.శేషయ్యనాయుడు 75వ జయంతి వేడుకలు సోమవారం నెల్లూరు బాలాజీనగర్‌లో ఆర్.వి.శేషయ్యనాయుడు సేవాసమితి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సినీ దర్శకులు శ్రీకాంత్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ శేషయ్యనాయుడు కళలన్నా, కళాకారులన్నా ఎంతో అభిమానించి, చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అందరికీ ఆర్థిక సహాయాన్ని అందించి చేయూతనిచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేతా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యసామాగ్రిని దర్శించుకున్న ముస్లింలు

నెల్లూరు కోటమిట్ట షాదీమంజిల్‌లు నిర్వహించిన హజరత్ మొహమ్మద్ ముస్తఫా నల్లలాహు అలైహి వ.సల్లం చెహరె ముబారక్(ఆసారె షరీఫ్)కు చెందిన పవిత్ర దివ్యసామాగ్రి ప్రదర్శన సోమవారం వైభవంగా ముగిసింది. ఈ సామాగ్రిని తిలకించేందుకు వివిద ప్రాంతాల నుంచి ముస్లింలు తరలివచ్చారు. ముగింపు సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు సయ్యద్ హమిద్ హుస్సేన్, హిదయతుల్లా, జలీల్‌ఖాన్, షేక్ అబ్దుల్ మునాఫ్, సయ్యద్ జలీల్ బాషా, పఠాన్ అక్బర్‌ఖాన్ విలేకర్లతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి ముస్లింలు వేలాదిగా తరలివచ్చి పవిత్ర దివ్య సామాగ్రిని దర్శించుకుని ప్రవక్త ఆశీస్సులు అందుకున్నదన్నారు.

# విజేతలెవరు?

(మొదటిపేజీ తరువాయి)

నిరసనగా జగన్ సభకే నమస్కారం పెట్టి బయటకెళ్లి పోవడం. ఏ సందర్భమూ లేకుండా నీ అంతుచూస్తానంటూ ప్రతిపక్ష సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించడం. మంత్రి పీతల సుజాత, వైకాపా ఎమ్మెల్యే రోజాల మధ్య రగడ, తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు, వైకాపా ఎమ్మెల్యే కేశినేని నానిల మధ్య రభస సభా మర్యాదలను భ్రష్టు పట్టించాయి. వీళ్ల తిట్టుకున్న తీరు చూస్తే తరతరాలుగా వీరి మధ్య పాత కక్షలున్నాయనిపించక మానదు.

ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రధానంగా వెల్లడైంది ప్రజల సమస్యలపై వివరణ ఇవ్వడంలో అధికారపార్టీ దారుణంగా విఫలమవడం. ప్రతిపక్షం ఎన్నో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చింది. ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఈ సమావేశాలలో పరిపక్వతతో వ్యవహరించారు. తన దృష్టికొచ్చిన సమస్యలపై పూర్తి వివరాలతో, ఆధారాలతో ప్రభుత్వాన్ని నిలదీసారు. ముఖ్యంగా చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీల విషయంలో ప్రభుత్వ కప్పదాట్లను ఎండగట్టారు. రైతు ఋణమాఫీ, డ్వాక్రా ఋణాలు, అంగన్‌వాడీల వేతనాలు, కరెంట్ ఛార్జీలు వంటి సమస్యలపై ఆయన పూర్తి సమాచారంతో మాట్లాడారు. ముఖ్యంగా పట్టిసీమ విషయంలో జరిగిన వాదోపవాదాలలో జగన్‌దే పైచేయిగా నిలిచింది. రాష్ట్రంలో ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. అదీగాక పట్టిసీమకు పైనే పోలవరం జాతీయ ప్రాజెక్ట్‌ను కేంద్రం మంజూరు చేసింది. పట్టిసీమను పూర్తిచేసి గోదావరి జలాలను శ్రీశైలంకు మళ్లించి రాయలసీమకు నీళ్లిస్తామని ప్రభుత్వం చెబుతోంది. రాయలసీమలో నీటి నిల్వకు ఏ ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయలేదు. మరి పట్టిసీమ నీళ్లను శ్రీశైలంకు మళ్లిస్తే తెలంగాణ రాష్ట్రం కూడా ఆ నీటిని వాడుకునే వీలుంది. అసలే అప్పుల్లో వున్న మనం మన డబ్బును తగలేసి తెలంగాణకు నీళ్లివ్వడమేమిటి? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ప్రతిపక్షం లేవనెత్తిన చాలా ప్రశ్నలకు ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పలేదు. సమస్యలపై దాటవేతకు వారు అనుసరించిన మార్గం ఒక్కటే! అదే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డిని తిట్టడం. ఆయన మరణించి ఐదేళ్లు దాటింది. రాష్ట్రంలో ప్రజలు ఆయనను మరచిపోయే పరిస్థితి వచ్చినా తెలుగుదేశం నాయకులు మాత్రం మరచిపోనీయడం లేదు. సమావేశాలలో పదేపదే వై.యస్. నామస్మరణ చేస్తూ కాలం గడుపుతున్నారు.

జగన్‌పై కేసులు, అవినీతి, కుంభకోణాలు అనేవి చట్టపరిధిలోని అంశాలు. చట్ట, న్యాయ సంస్థలు వాటిని చూసుకుంటాయి. జగన్ కేసుల గురించి సభలో గంటలకొద్దీ మాట్లాడి విలువైన సభా సమయాన్ని వృధా చేయాల్సిన అవసరం లేదు. కాని అధికారపార్టీ వారికి సమస్యలపై సమాధానం చెప్పే సహనం లేదు. ఇది చేసామని చెప్పడానికి అవకాశాలు కూడా లేవు. అందుకే సమావేశాలనే కంపు చేసి పెట్టారు.

# నవ్య రాజధాని

(మొదటిపేజీ తరువాయి)

పేర్లు పెడితే, ఇంకొన్ని రాజధానులకు ఆంగ్లేయులు పెట్టిన పేర్లే వున్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధానికి ఒక చక్కటి తెలుగు పేరు పెట్టడం ఆనందించాల్సిన విషయమే.

ఇక అమరావతి రాజధాని ఎంపిక వెనుక చంద్రబాబు దూరాలోచన చాలావుంది. అమరావతిని బౌద్ధ కేంద్రంగా అభివృద్ధి చేసి, ఈ సెంటిమెంట్‌తో రాజధాని నిర్మాణంలో బుద్ధుడిని ఆరాధించే జపాన్, సింగపూర్ వంటి దేశాల సహకారం పొందాలనేది ఆయన ఆలోచన. ప్రతిక్షణం వ్యాపారం, వాణిజ్యం, ఆదాయం గురించి ఆలోచించే ఆ దేశాలు చంద్రబాబు ఆలోచనలకు ఏ మాత్రం సహకరిస్తాయో చూడాలి.

అమరావతి అంటే ధాన్య కటకం. ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ అనే పేరొచ్చింది దీనివల్లనే! రాష్ట్రం మొత్తానికి కావాల్సిన ధాన్యం ఇక్కడే పండేది. అలాంటి పంటలను అందించిన భూములను ఈరోజు రాజధాని పేరుతో కాంక్రీట్ అరణ్యంగా మార్చుకుంటున్నాము. ఒకప్పుడు యుద్ధాలతో, దాడులతో అమరావతి కాలగర్భంలో కలిసిపోతే, ధాన్యకటకంలా వెలసిల్లిన అమరావతిని ధాన్యమే పండని ఎడారిగా మార్చే పనిలోపడ్డాము.

# దుగరాజపట్నంకు బ్రేక్

(5వపేజీ తరువాయి)

దీనిపై కేంద్ర పోర్టులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇచ్చిన సమాధానం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపింది. దుగరాజపట్నం వద్ద పోర్టును నిర్మించడానికి కేంద్రం సిద్ధంగా వుందని, అయితే అందుకు భూసేకరణ జరగడం లేదని, భూమిని సేకరించి ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ పని చేయలేదు కాబట్టి ఈ పోర్టు పురోగతి లేదని ఆయన కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు.

మన రాష్ట్రంలో అతిపెద్ద పోర్టు నిర్మాణానికి కేంద్రం ముందుకొస్తే దానిని కాలదన్నడం మన పాలకులకే చెల్లింది. సింగపూర్ లాంటి రాజధాని మైకం కమ్మిన ప్రభుత్వాధినేతల కళ్లకు పోర్టులు, పరిశ్రమల అభివృద్ధి వంటివి కనపడడం లేదు.

శ్రీను గల్పిక

# వివేకా సరసన హాలీవుడ్ తారలు

ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలో స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(64) నివాసం. అతను మంచి నిద్రలో వున్నాడు. ముదురుదోమలు నాలుగుపోట్లు పొడవడంతో అబ్బా... అని కేకపెడుతూ వివేకా నిద్రలేచాడు. కళ్లు తెరిచాడు. అంతా చీకటిగానే వుంది... ఈ దోమలతో నిద్రలేకుండా పోతుంది. ఇంకా తెల్లారినట్లు లేదు. చీకటిగానే వుందని మళ్లీ పడుకుని కళ్లు మూసుకున్నాడు. అప్పుడే ఆయన బెడ్‌రూం తలుపు 'కిర్'మనే సౌండ్‌తో తెరచుకుంది... వివేకా కళ్లు తెరిచాడు. చీకట్లో ఎవరూ కనిపించలేదు. ఈమధ్య సెకండ్‌షోలలో 'కాంచన', 'కాలింగ్‌బెల్' 'ప్రేమకథా చిత్రమ్', 'మోహిని' వంటి దెయ్యాల సినిమాలు చూసి వున్నాడు. ఆ సినిమాలలో తలుపులు వాటిపాటికవే తెరుచుకోవడం, మనిషి కనపడకుండా అడుగుల చప్పుడు మాత్రమే వినిపించడం వంటి సన్నివేశాలు గుర్తుకొచ్చాయి. సేమ్ టు సేమ్ వివేకా బెడ్‌రూం తలుపు తెరుచుకున్నాక కూడా అలాగే ఎవరో లోపలకు వస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది. ఏదో కామపిశాచి తన మీద పగబట్టిందని, ప్రతీకారం తీర్చుకోవడానికే ఈ టైంలో వచ్చిందని వివేకా భయపడసాగాడు. భయంతో ఆయనకు చెమటలు పట్టసాగాయి. భయంతోనే వచ్చీరాని ఆంజనేయ దండకం చదవసాగాడు. వణుకుతూనే ధైర్యాన్నంతా కూడదీసుకుని.. ఎవరు? అని గట్టిగా అడిగాడు. సార్, నేను సార్ రాజును, మీ పిఏను అని వినిపించింది. వివేకాకు ఒక్కసారిగా భయం పోయింది. ధైర్యం వచ్చింది. వెంటనే కోపం కూడా తెచ్చుకుని... ఇంత అర్ధరాత్రి వేళ బెడ్‌రూంలోకెందుకొచ్చావ్... అనిపైకి అరచి మనసులో మాత్రం నీ దెబ్బకు దెయ్యమనుకుని జడుసుకుంటినే అని అనుకున్నాడు. దానికి రాజు... ఇంకా అర్ధరాత్రి ఏంటి సార్, ఉదయం 8గంటలైందన్నాడు. మరి ఇంకా చీకటిగా ఉందేంటని వివేకా అడిగాడు. రాజు, వివేకా ముఖం వైపు చూసాడు. విషయం అర్ధమైంది. వెంటనే ఆయన కళ్లకున్న నల్లద్దాలను తీసి పక్కన పెట్టాడు. అప్పుడు వివేకా... ఓహో ఇదా విషయం, రాత్రి సెకెండ్‌షో చూసేటప్పుడు ఈ నల్లద్దాలు పెట్టుకున్నాను, రాత్రి పడుకునేటప్పుడు వాటిని తీయడం మరచిపోయాను అని, నా కోసం ఎవరైనా వచ్చారా, అయినా ఇప్పు డెవరొస్తారులే, మనం పవర్‌లో లేం కదా అని అన్నాడు. ఆ మాటకు రాజు... లేదు సార్ వచ్చారు. సినీ దర్శకులు వి.వి.వినాయక్, పూరీ జగన్నాథ్, రాజమౌళి, శ్రీనువైట్ల, కె.రాఘవేంద్రరావు, శంకర్, నిర్మాతలు దిల్ రాజు, సురేష్‌బాబు, అల్లు అరవింద్, హీరోలు బాలకృష్ణ, వెంకటేష్, మహేష్ బాబు, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్‌లు వచ్చారన్నాడు. వివేకా అదిరిపడ్డాడు. వీళ్లంతా నా కోసం రావటమేంట్రా... ఇది కల కాదుకదా అని వివేకా అన్నాడు. మీరు సినిమాలలో నటించాలని ఉందని స్టేట్‌మెంటిచ్చారుగా, అది కూడా రేప్‌సీన్లలో... అందుకోసమే వీళ్లందరూ వచ్చారని రాజు చెప్పాడు. అందర్నీ లోపలకు పంపించమని వివేకా చెప్పాడు. రాజు అందర్నీ లోపలకు పంపించాడు. మొదట రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. వివేకా గారు, తెలుగు సినీపరిశ్రమలో నాకొక రికార్డు వుంది. మీతో మొదటి సినిమా చేసిన రికార్డు కూడా నాకే దక్కాలని ఆశపడుతున్నారు. మీ ఏజ్‌కు తగ్గట్టుగా హీరోయిన్‌ను కూడా మీరే సెలక్ట్ చేసుకోవచ్చు. నాటి వాణిశ్రీ నుండి నేటి కాజల్ వరకు మీరు ఎవరిని హీరోయిన్‌గా కోరుకుంటే వారిని మీ పక్కన సెలక్ట్ చేస్తాను. ఇక పాటల్లో పండ్లు, కూర గాయల సీన్లు కూడా మీ ఇష్టప్రకారమే తీస్తానన్నాడు. రాజమౌళి వుండి... ఈగను పెట్టి సినిమాను హిట్ చేసాను, అలాంటిది మిమ్మల్ని పెట్టి సినిమా హిట్ చేయలేనా? మీ మొదటి ఛాన్స్ నాకివ్వండి సార్ అని అడిగాడు. శ్రీను వైట్ల వుండి... సార్, మీకు కామెడీ మిక్స్ చేసిన హీరో రోల్ బాగా సెట్ అవుతుంది. కాబట్టి మొదటి అవకాశం నాకే ఇవ్వండని కోరాడు. శేఖర్ కమ్ముల అందుకుని... సార్, మీ జీవితంలో ఎన్నో లవ్‌స్టోరీలు ఉన్నాయని తెలిసింది. వాటిలో ఒక స్టోరీని ఎంచుకుని మీతోనే సినిమా తీస్తాను. వెరైటీగా ఉంటుంది ఆలోచించండి సార్ అని చెప్పాడు. అప్పుడు వివేకా కలుగజేసుకుని మీరంతా నాకు హీరో క్యారెక్టర్ ఇస్తామంటున్నారు, సినిమాలలో హీరోకి ఫైట్లు, డ్యాన్స్‌లు తప్ప ఇంకేమీ వుండవు. అదే విలన్‌గా అయితే రెండు, మూడు రేప్‌లన్నా ఉంటాయి. నేను రేప్ సీన్‌లుండే విలన్ క్యారెక్టర్ అయితేనే చేస్తానని చెప్పాడు. దాంతో మళ్లీ అందరూ మీకు విలన్‌పాత్రే ఇస్తామని, రేప్ సీన్‌లలో సైడ్ ఆర్టిస్ట్‌లు, ఇమేజ్ కోల్పోయిన హీరోయిన్‌లను పెడతామని చెప్పారు. కాని వివేకాకు అది నచ్చలేదు. ఇదంతా పాత చింత కాయ పచ్చడిలానే వుంది, వెరైటీగా వుండాలన్నాడు. అప్పుడు అల్లు అరవింద్ లేచి... ఆ వెరైటీ విలన్‌పాత్ర నేనిస్తాను, అది కూడా మీరు చిరంజీవితో కలిసి ఆయన నటించే 150వ చిత్రంలో చేయాలన్నారు కదా, మీ కోరిక నేను తీరుస్తాను, చేస్తారా? అని అడిగాడు. ఓ తప్పకుండా... రేప్ సీన్‌లు ఖచ్చితంగా ఉంటాయి కదా అని వివేకా అడిగాడు. ఖచ్చితంగా ఉంటాయి. ఆ రేప్‌సీన్‌లలో కూడా ఇండియన్ ఆర్టిస్ట్‌లను పెట్టడం లేదు, అంతా హాలీవుడ్ యాక్టర్స్‌నే పెడతామని చెప్పాడు. ఆ మాటతో వివేకా నరాలు జివ్వుమన్నాయి. వెంటనే... అట్లయితే షూటింగ్ ఎప్పుడు పెట్టుకుందామని వివేకా అడిగాడు. రేప్‌సీన్‌లకు ముహూర్తం రేపే పెట్టుకుందాం, ముందు విదేశీ అమ్మాయిలతో రేప్‌సీన్‌లను కంప్లీట్ చేద్దాం, వెంటనే హైదరాబాద్ వచ్చేయమని చెప్పాడు. వివేకా... గాల్లో తేలినట్టుందే... గుండె పేలినట్టుందే... అని పాడుకుంటూ లేచాడు.

★★★★★

హైదరాబాద్ శివార్లలో షూటింగ్ లొకేషన్. నిర్మాత అల్లు అరవింద్, డైరక్టర్ పూరీజగన్నాథ్, ఇతర సాంకేతిక నిపుణులు కెమెరాలతో రెడీగా వున్నారు. వివేకా చారల బనియన్, జీన్స్ ఫ్యాంట్ వేసుకుని షూటింగ్‌కు సిద్ధమయ్యాడు. ఫారిన్ అమ్మాయిలను హాలీవుడ్ సినిమాలలో, ఫ్యాషన్ టీవీలలో చూడడమేగాని వారిని దగ్గరగా చూసింది లేదు. అలాంటిది ఇప్పుడు వారితోనే రేప్‌సీన్‌లలో నటించబోతున్నాను... అని ఊహించుకుంటుంటేనే వివేకా మనసు గాల్లో తేలిపోసాగింది. అల్లు అరవింద్‌తో వివేకా... ఇంకా ఫారిన్ ఆర్టిస్ట్‌లు రాలేదా అని అడిగాడు. అదిగో ఇప్పుడే వచ్చారు అని అన్నాడు. అప్పుడే అక్కడకు ఓ కారొచ్చి ఆగింది. అందులో నుండి ముగ్గురు యువతులు దిగారు. అల్లు అరవింద్ వారిని వివేకాకు పరిచయం చేస్తూ... ఈమె లూసియా ఫ్రమ్ ఉగాండ, ఈమె ఆల్డా ఫ్రమ్ తూర్పు ఆఫ్రికా, ఈమె జన్నీఫర్ ఫ్రమ్ కెన్యా... ఈ ముగ్గురుతోనే మీరు రేప్ సీన్‌లలో నటించాలన్నాడు. వారిని చూడగానే వివేకా కళ్లు బైర్లు కమ్మాయి. కళ్లముందే ఆశల సౌధాలు కూలిపోయాయి. ముగ్గురూ నీగ్రోజాతి మహిళలు. బలిష్టంగా వున్నారు. ఫారిన్ అమ్మాయిలు అంటే ఏదో వూహించుకున్నాను, నా జీవితాన్ని ఈ విధంగా నాశనం చేయాలనుకున్నారా, మీకోదండం, మీ సినిమాకో దండం అంటూ వివేకా అక్కడనుండి పరుగులంఘించుకున్నాడు.

## కదంబం

### ఇంతే!

**యక్కలూరి శ్రీరాములు**
అనంతపురం.


తనివితీర మాటాడటమన్నది
తరుగుతున్నప్పుడు...
అనుభవాలన్నీ
గతస్మృతులై మరుగునపడుతున్నప్పుడు...
కొత్తగ కొలువుదీరే మనసు కోసం
మత్తైన మరో తీపి పలుకు కోసం
చేతులు చాచిన తీరం కోసం
అంతరంగాన అలల వేట మొదలవుతుంది
కానీ!
కొత్త కొత్త పరిచయాలు
సరికొత్త ఉత్సాహాన్ని మనలో
కాసేపే నింపుతాయ్...
తాత్కాలిక మోహాలు
గతితార్కికతతో కొన్నాళ్లు
కొనసాగి... కొనసాగి...
చిత్తుకాగితాల్లెక్కన
జీవితాన్ని ముఖ్ఖలు ముఖ్ఖలుగ చింపుతాయ్...
ఎన్ని తుంటరి పనులు
మరెన్ని కొంటె పనులు చేసినా
నా ఒంటరితనమే చివరికి నను
వెన్నంటి నిలిచింది
మోహావేశంలో వడ్డెన తలుపులు
ఎన్నిసార్లు తెరిచానో
మోహమెత్తి మరెన్నిసార్లు మూసానో
అటు నుంచి ఇటు ఇటు నుంచి అటు తిరగడానికి
తిరిగి చూడడానికి
గోడలు తలుపులు లేని నా ఇంటికి
గడపకూడా లేదు...
ఏవని! ఎన్నని?
ఎన్నిసార్లు తలుపు తెరచి తరచి చూసినా
అర్థమవదు!
అందుకే...
అనుభవించిన క్షణంలోనే
సన్యసించడం నేర్చుకున్నా...
గురుతులకు చోటివ్వని గుండెను
ఎదలో అమర్చుకున్నా...
జ్ఞాపకాలు జ్ఞానానికి పనికిరానివని...
పనికి రావని తెలిసి
జ్ఞానోదయం కోసం చుక్కల్ని
లెక్కిస్తూ కూర్చున్నా...
జననం లేని మరణ మొక్కటి చాలు!
అంతవరకు నాలోకి మీరాక
ఆగదు గాక ఆగదు
మరణం రాని జనన మొక్కటి మేలు
అంత దనుక మీలోకి నా రాక
ఏమారదుగాక ఏ మారదు
నాకు తెలుసు!
మిమ్మల్నొదలి నన్ను నేనా చేరుకోవడానికి
నాకు ఈ జీవితకాలం
సరిపోదుగాక సరిపోదు



## 'సృజన' ఉగాది పండుగ

నెల్లూరులోని సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం టౌన్‌హాలు ప్రాంగణంలోని జూ. రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరిగిన ఉగాది వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేదిక అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, సూక్ష్మ కళాకారుడు అయిన కాళహస్తి వెంకటశేషగిరిరావుకు ఉగాది పురస్కారం ప్రదానం చేశారు. అదేవిధంగా, సింధుభైరవి ఆర్కెస్ట్రా అధినేత యు.శ్రీగౌరికి ఉగాది సత్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాలపర్తి సాయిప్రసాద్, డాక్టర్ మారం సుధాకర్, బి.వి నరసింహం, జి.బాబురావు, సర్వేపల్లి రామమూర్తి, కవులు రాచపాళెం రఘు, మద్దూరు శ్రీనివాసులు, అల్లాడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. తొలుత జరిగిన గీతాలాపన పోటీల్లో విజేతలైనవారికి వేదిక నిర్వాహకులు బహుమతులిచ్చారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వివిఎస్ సురేష్‌కుమార్, ఎన్‌పి అరుణ, పి.ఉషారాణి సాధించగా, జూనియర్స్ విభాగంలో శ్రీచరిత, అఫ్రిద్‌బేగ్, నందిని బహుమతులను అందుకున్నారు. ఈ పోటీలకు శ్రీలత, జ్యోతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## సేవలోనే భక్తితత్వం




భక్తి భావాన్ని సేవా మార్గంలోకి మళ్లిస్తే అదో పెద్ద సామాజిక విప్లవం కావడం ఖాయం. ఇలాంటి ప్రయత్నమే నెల్లూరు బాలాజీనగర్ శివార్లలోని పద్మావతినగర్‌లో గల అద్దాల సాయిబాబా మందిరంలో చోటుచేసుకుంది. ఈ మందిరంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి. సాధారణంగా పండుగలు, ఉత్సవాలప్పుడు అన్నదానం నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చేస్తుంటారు. ఈ సంవత్సరం మందిరం నిర్వాహకుడు మధుసాయి సాయి భక్తులచే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 54మంది సాయిభక్తులు రక్తదానం చేశారు. ప్రముఖ రక్తదాత వై.వి.సుబ్బారావు ఈ శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్ సాయినాథ్ పర్యవేక్షించారు. భక్తిభావంలో ఇదో మంచి కోణం, మానవతా మార్గం. సాయి చూపించిన మార్గం కూడా ఇదే! ప్రతి పండుగలలో, ఉత్సవాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించే సంప్రదాయాన్ని భక్తులు, ఆలయాల నిర్వాహకులు అలవరచుకోవాలి.

## ప్రపంచ క్రికెట్ సంగ్రామం నుండి

# నిష్క్రమించిన భారత్




కోట్లాదిమంది క్రికెట్ అభిమానుల ఆశలు నీరుగారాయి. నూటపాతిక కోట్ల మంది భారతీయుల మనసులు మౌనంగా రోదించాయి. ఎనిమిది గంటల పాటు ఉత్కంఠతతో చూసారు. క్రీడలలో గెలుపోటములను సమానంగా తీసుకోవాలనే స్ఫూర్తితో ఈ బాధను దిగమింగారు.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు వేదికగా జరుగుతున్న ప్రపంచ కప్ క్రికెట్ మహాసంగ్రామం నుండి టీమిండియా నిష్క్రమించింది. మార్చి 26వ తేదీ సిడ్నీలో జరిగిన సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో 95పరుగుల తేడాతో భారత జట్టు పరాజయం చవి చూసింది. సెమీఫైనల్‌లో నెగ్గి, ఫైనల్స్‌లో విజృంభించి ప్రపంచ కప్‌ను వరుసగా రెండోసారి చేజిక్కించుకోవాలనుకున్న భారత్ ఆశలకు సెమీస్‌లోనే కళ్లెం పడింది.

సొంత పిచ్‌పై ఆస్ట్రేలియా విజృంభించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకోవడం ఆ జట్టుకు వరమైంది. మొదటి ఓవర్ నుండి దూకుడుగా ఆడిన ఆసీస్ ఆటగాళ్లు చివరి 50వ ఓవర్ వరకు అదే వూపును చూపించి 329పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ ముందుంచారు. భారత బౌలర్లు ఏ దశలోనూ ఆసీస్ పరుగుల ప్రవాహానికి పగ్గాలేయలేకపోయారు. స్మిత్ సెంచరీతో చెలరేగిపోగా, ఫించ్ 81పరుగులతో జట్టు స్కోరు పెంచారు. ఇక జాన్సన్, ఫాల్కనర్‌లు వేగంగా ఆడి రన్‌రేట్ అమాంతం పెంచారు. 329పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు మొదటి పది ఓవర్ల వరకు నిలకడగానే ఆడింది. ఓవర్‌కు 6పరుగుల చొప్పున రన్‌రేట్ లాగింది. ఎప్పుడైతే శిఖర్ ధావన్ భారీ షాట్ కొట్టి అవుటయ్యాడో అప్పటి నుండి వికెట్ల పతనం మొదలైంది. జట్టులో ఏ ఆటగాడు భారీ స్కోర్ చేయలేదు. ధావన్, రోహిత్‌శర్మ, ధోని, రహానెలు ఒక మోస్తరు స్కోర్లు చేసారు. అతిగా అంచనాలు పెట్టుకున్న విరాట్ కోహ్లీ ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. ఇక గత వరల్డ్ కప్‌లో యువరాజ్‌సింగ్ పోషించిన పాత్రను తాను పోషిస్తానన్న రైనా కూడా త్వరగానే పెవిలియన్ బాట పట్టడంతో 233 పరుగులకే భారత జట్టు పోరాటం ముగిసింది. ఇక్కడితో టోర్నీ నుండి భారత్ నిష్క్రమించింది. అంతకుముందు రెండురోజుల క్రితమే న్యూజిలాండ్ – సౌతాఫ్రికా సెమీఫైనల్ పోరు జరిగింది. గెలుపు న్యూజిలాండ్‌దే అయినా దక్షిణాఫ్రికా పోరాడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. కానీ భారత జట్టు విజయం కోసం ఆ స్థాయిలో పోరాడలేకపోయింది.

అయితే టోర్నీకి ముందు పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే టీమిండియా సెమీఫైనల్ దాకా రావడం సంతోషించదగ్గ విషయమే. భారత్‌పై అప్పుడు అసలు అంచనాలే లేవు. కాని లీగ్ దశలో వరుసగా పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, యూఎఇ, ఐర్లాండ్, జింబాబ్వే జట్లపై విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై ఏడో విజయం నమోదు చేసింది. దీంతో భారత్ ప్రపంచకప్ గెలుస్తుందనే ఆశలు కలిగాయి. అయినా, క్రీడలలో అందరూ గెలవరు... కాని అందరూ గెలుపు కోసమే ప్రయత్నిస్తారు. ఆటలో ఫలితం ఏదైనా హూందాగా స్వీకరించడమే క్రీడాస్ఫూర్తికి నిదర్శనం.

# జిల్లా ఎస్పీగా గజరావు భూపాల్

# గ్రేహౌండ్స్‌కు సెంథిల్

## • బదిలీ వెనుక తెలుగునేతల హస్తం?

జిల్లా ఎస్పీగా గజరావు భూపాల్‌ను నియమించారు. 2008 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన భూపాల్ మెదక్ జిల్లా ఏఎస్పీగా, ఆ తర్వాత అదిలాబాద్ ఎస్పీగా పనిచేసారు. ప్రస్తుతం విఆర్‌లో ఉంటూ నెల్లూరు జిల్లా ఎస్పీగా వస్తున్నారు.

జిల్లా ఎస్పీగా ఇప్పటివరకు వున్న ఎస్.సెంథిల్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ విభాగానికి బదిలీ చేసారు. 2014జూలై 30వతేదీన ఆయన జిల్లా ఎస్పీగా వచ్చారు. అప్పట్లోనే ఆయన నియామకాన్ని పలువురు అధికారపార్టీ నాయకులు వ్యతిరేకించారు. అయినా చంద్రబాబు నెల్లూరుకు గట్టి అధికారి కావాలని చెప్పి సెంథిల్‌ను వేశారు. అనుకున్నట్లే సెంథిల్‌కుమార్ గట్టిగా వ్యవహరించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగలేదు. ముఖ్యంగా తెలుగుదేశం నాయకుల ఆటలు సాగనీయలేదు. దీంతో అధికారంలో వున్నామన్న తృప్తి ఆ పార్టీ నాయకులకు లేకుండా పోయింది.

ముఖ్యంగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అయితే సెంథిల్‌కుమార్ మీద కత్తికట్టాడు. సెంథిల్‌కుమార్‌ను బదిలీ చేయాలంటూ సిఎం చంద్రబాబుకు పలుసార్లు విన్నవించుకున్నాడు. త్వరలో ఎస్పీ సెంథిల్‌కుమార్ బదిలీ కాబోతున్నాడంటూ ఇటీవలే కురుగొండ్ల బహిరంగంగా చెప్పాడు. దీనిని బట్టే సెంథిల్‌కుమార్ బదిలీలో రాజకీయం ప్రధానపాత్ర పోషించిందనేది అర్ధమవుతుంది.

ఎస్పీగా సెంథిల్‌కుమార్ జిల్లాలో గట్టిగా 8నెలలు కూడా పూర్తి చేయలేదు. ఈ కాలంలోనే ప్రశంసలున్నాయి, విమర్శలున్నాయి. ముఖ్యంగా పోలీసుశాఖను పరుగులు పెట్టించాడు. ఉదయం 7గంటలకే అన్ని స్టేషన్‌లలో సిఐలు, ఎస్ఐలు ఉండేలా సెట్‌కాన్ఫరెన్స్‌లు నిర్వహించాడు. ఎక్కడ పొరపాటు జరిగినా తక్షణ చర్యలు తీసుకునేవారు. ఈ 8నెలల్లోనే జిల్లా పోలీస్‌శాఖలో సస్పెండ్‌లు బాగా పెరిగాయి. ఒక రకంగా చెప్పాలంటే పోలీసులు బాగా పనిఒత్తిడికి లోనయ్యారు. బి.వి.రమణకుమార్, నవదీప్‌సింగ్‌గ్రేవాల్ హయాంలో బాగా విశ్రాంతి తీసుకున్న పోలీసులకు సెంథిల్‌కుమార్ టైంలో తీరిక లేకుండా పోయింది. రోడ్ల మీద పోలీసులను బాగా తిప్పాడు. అయితే ఎస్పీగా సెంథిల్‌కుమార్ పబ్లిక్‌లోకి వచ్చింది, పబ్లిక్‌తో సంబంధాలు నెరిపింది చాలాతక్కువ. ఇసుక, ఎర్రచందనం అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. జాక్‌పాట్ వ్యాపారాలకు చరమగీతం పాడారు. నేరాల నియంత్రణకు, పోలీసుస్టేషన్‌లలో పనితీరు మెరుగు పడడానికి వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువుగా వాడుకొన్నారు. పోలీసుల చేత వాడించారు. సెంథిల్‌కుమార్ బదిలీకి నాలుగు నెలలుగా ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. ఎట్టకేలకు ఆ ప్రయత్నం ఫలించింది.




గురువారం నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న జిల్లా టిడిపి నాయకులు డాక్టర్ జడ్.శివప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

# వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 30 నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా నిర్వహిస్తున్నట్లు మాజీఎమ్మెల్యే, దేవస్థానం ఛైర్మెన్ ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం దేవస్థానం ఆవరణలో విలేకర్లతో మాట్లాడారు. 30వతేదీ సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమై 9వతేదీ ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 10గంటలకు ధ్వజారోహణ సమయంలో సంతానభాగ్యం కావాలని కోరే నూతన వధూవరులు, పుణ్యదంపతులు శ్రీ స్వామివారి కొడిముద్ద ప్రసాదం కొరకు ఉదయం 9గంటలకు సాంప్రదాయ దుస్తులతో రావాలని కోరారు. ఏప్రియల్ 1వ తేదీ హంస వాహనం, 2వ తేదీ చంద్రప్రభ, 3వ తేదీ వెండిహనుమంత సేవ, 4వ తేదీ గరుడసేవ, 5వ తేదీ కల్యాణం, 6వ తేదీ రథోత్సవం, 7వ తేదీ అశ్వవాహనం, 8వతేదీ పొన్నవాహనసేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం వివిధ జిల్లాల నుండి వచ్చే కళాకారులతో ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

# ఇంత బలవంతంగా పన్నులు వసూళ్లా..?

### - ఆనం రంగమయూర్‌రెడ్డి ధ్వజం



నెల్లూరు నగర ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు చేసే విధానం చూస్తుంటే ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ప్రజల మెడ మీద కత్తిపెట్టి వసూలు చేస్తున్నట్లు వుందని ఇంటి పన్నులు వసూలు చేసే విధానం ఇదేనా అంటూ.. 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుధవారం నెల్లూరు ఏసి సెంటర్‌లోని నగర కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు చేసే విధానం మీద ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే వుందన్నారు. ప్రజల నుండి వసూలు చేసే పన్నులతో అభివృద్ధి చేయాలనడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం ప్రజలకు వడ్డీ మాఫీ చేసి వుంటే దాదాపు 90శాతం పన్నులు వసూలు జరిగి వుండేవన్నారు. ఇప్పుడు కార్పొరేషన్ వారు వసూలు చేస్తున్న పన్నుల విధానం చూస్తుంటే ప్రైవేటు ఫైనాన్స్ వారు బెదిరిస్తున్నట్లు వుందన్నారు. నగర మేయర్ కార్పొరేషన్‌ని ఫైనాన్స్ కంపెనీ అనుకుంటున్నారని, ప్రజల ఆశలను వమ్ము చేసారని, గత పాలకుల మీద మాట్లాడే అర్హత మేయర్‌కు లేదన్నారు. ప్రభుత్వం నుండి గ్రాంట్సు తెచ్చే సత్తా మేయర్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో ఖాదర్‌బాషా, శివ, ముసవీర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com